



# విజయభాను






హైదరాబాద్, శుక్రవారం 13-10-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 37 సంచిక : 30 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## జీఎస్టీ పరిధిలోకీ

# రియల్‌ఎస్టేట్!

- భారీస్థాయిలో పన్ను ఎగవేత
- రాష్ట్ర ప్రభుత్వాలపై చర్చించాకే నిర్ణయం
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



వాషింగ్టన్: రియల్ ఎస్టేట్‌ను కూడా జీఎస్టీ కిందకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. హార్వర్డ్ యూనివర్సిటీలో మాట్లాడారు. భారత్ చేపట్టిన పన్ను సంస్కరణలపై ఆయన తన అభిప్రాయాలను వినిపించారు. రియల్ ఎస్టేట్ రంగంలో భారీ స్థాయిలో పన్ను ఎగవేత జరుగుతున్నదని.. త్వరలోనే తరువాయి 2లో

## బాణసంచా..

### ఆన్‌లైన్ అమ్మకాలపైనా నిషేధం



న్యూఢిల్లీ: వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ, ఎన్‌సీఆర్ రీజియన్‌లో బాణసంచా అమ్మకాలపై సుప్రీంకోర్టు విధించిన నిషేధం ఆన్‌లైన్ అమ్మకాలు, కొనుగోళ్లకు సైతం వర్తిస్తుందని ఢిల్లీ పోలీసులు గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు, అమ్మకాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసు ప్రతినిధి మాధుర్ వర్మ మీడియాకు తెలిపారు. కొత్త ఉత్తర్వు అమల్లోకి రావడంతో అంతకుముందు తరువాయి 2లో

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ



హైదరాబాద్: ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలను మరింత మెరుగుపరిచేందుకుగాను ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్ డైరెక్టర్ సి.హెచ్.వెంకటరమణరెడ్డి పేర్కొన్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టాలెంట్ స్ప్రింట్ వారితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేలా నైపుణ్యాన్ని పెంపొందించే అంశాలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఇది ఆన్‌లైన్‌లో తరువాయి 2లో

## నష్టపోయిన పంటల పరిశీలన



హైదరాబాద్: భారీ వర్షాలతో మునకకు గురైన పంటలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌తో పాటు చిలుకూరు, అప్పోజిగూడ, శ్రీరాంనగర్ తదితర గ్రామాల్లో జరిగిన నష్టాన్ని వ్యవసాయాధికారి రాగమ్మ స్వయంగా పరిశీలించారు. ఇక చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అమ్డాపూర్ పరిధిలో తరువాయి 2లో

## ముందుగా యుద్ధానికి

# నిప్పు పెట్టింది ట్రంపే



మాస్కో: అగ్రరాజ్యం అమెరికా, ఉత్తరకొరియా మధ్య పరిస్థితులు చూస్తుంటే పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నాయి. వరుస క్షిపణి ప్రయోగాలతో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న ఉత్తరకొరియాపై అమెరికా వరుస హెచ్చరికలు చేస్తూనే ఉంది. అయినా ఆ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఉత్తరకొరియా సై అంటే సై అంటూ మాటల దాడికి దిగుతోంది. ఈ పరిస్థితులు చూస్తుంటే మరో యుద్ధం వస్తుందేమో అని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ యుద్ధానికి నిప్పు పెట్టింది మాత్రం ట్రంపేనని ఆ దేశం ఆరోపిస్తోంది.

ఉత్తరకొరియా విదేశాంగ మంత్రి రి యాంగ్ హో రష్యా అధికారిక మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మా అణుప్రయోగాలు దేశ ప్రజల శాంతి భద్రతల కోసమే. అయితే ఐక్యరాజ్యసమితి వేదికగా ట్రంప్ పిచ్చిపట్టినట్లుగా ఉత్తరకొరియాపై వ్యాఖ్యలు చేశారు. మాపై యుద్ధానికి ఆయనే నిప్పు పెట్టారు. మేం కూడా ఆ యుద్ధానికి మంటలతోనే సమాధానం చెబుతాం. మాటలతో కాదు. అమెరికా శక్తిసామర్థ్యాలతో సరితూగేందుకు మేం సిద్ధమవుతున్నాం. మా లక్ష్యాలను తరువాయి 2లో

## శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తివేత

### ఏపీ మంత్రి దేవినేని ఉమ



*కర్నూలు: మూడేళ్ల తర్వాత శ్రీశైలం ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో గురువారం ఉదయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఏపీ మంత్రి దేవినేని ఉమ ప్రాజెక్టు వద్ద* తరువాయి 2లో

# తల్లిదండ్రులు నిర్దోషులు

### ఆరుషి హత్య కేసులో సంచలన తీర్పు



( ఫైల్ ఫోటో )

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరుషి హత్యకేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరుషి తల్లిదండ్రులను నిర్దోషులుగా తేల్చింది. ఆరుషిని ఆమె తల్లిదండ్రులే చంపారనడానికి ఆధారాలు లేవని న్యాయస్థానం పేర్కొంది. ఘజియాబాద్‌లోని దస్నా జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆరుషి తల్లిదండ్రులు.. నుపుర్, రాజేష్ తల్వార్‌కు కేసు నుంచి ఊరట లభించింది.

2008 మే 16న నోయిడాలోని జలవాయి విహార్‌లో.. వారం రోజుల్లో పుట్టిన రోజు జరుపుకోవాల్సి ఉన్న 14 ఏళ్ల ఆరుషి అత్యంత పాశవికంగా హత్యకు గురైంది. పనిమనిషి హేమరాజ్‌తో కలిసి ఆరుషి తల్లిదండ్రులు నుపూర్ తల్వార్, రాజేష్ తల్వార్ ఆమెను హత్య చేసినట్టు ఉత్తర్రప్రదేశ్ కోర్టు 2013లో తీర్పుచెప్పింది. దీంతో ఈ కేసులో వీరిద్దరికీ జీవిత ఖైదు పడింది. ఆ తర్వాత వారు ఈ తీర్పుపై అలహాబాద్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు.

ఆరుషి తల్లిదండ్రులు చేసుకున్న అప్పీల్‌పై జస్టిస్ బీకే నారాయణ, జస్టిస్ ఏకే మిశ్రాతో కూడిన హైకోర్టు బెంచ్ గత సెప్టెంబర్‌లో విచారణ చేపట్టింది. ఆ తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు గురువారం (అక్టోబర్ 12) తుది తీర్పును వెలువరించింది.

ఆరుషి హత్యకేసు అప్పట్లో దేశంలో సంచలనం సృష్టించింది. మొదట పని మనిషి హేమరాజే ఈ హత్యకు పాల్పడినట్టు అనుమానించారు. అయితే ఆరుషి హత్యకు గురైన ఫ్లాట్‌లోని టెర్రాస్‌పై రెండు రోజుల తర్వాత హేమరాజ్ కూడా విగతజీవిగా పడి ఉండటంతో కేసు మరో మలుపు తిరిగింది. తల్వార్ దంపతులను అనుమానించిన పోలీసులు.. ఆ దిశగా దర్యాప్తు జరిపి ఆరుషి, హేమరాజ్ హత్యలకు రాజేష్, నుపూరే కారణమనే నిర్ధారణకు వచ్చారు.

అయితే.. దర్యాప్తును తప్పుదోవ తరువాయి 2లో

## మేడారం జాతర పనుల్లో వేగం పెంచాలి

### జయశంకర్ జిల్లా జేసీ అమయ్‌కుమార్



హైదరాబాద్: మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర పనుల్లో వేగం పెంచాలని జయశంకర్ జిల్లా సంయుక్త కలెక్టర్ డి.అమయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర ప్రారంభమయ్యే సమయం చాలా తక్కువగా ఉన్నందున వెంటనే పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు పనుల టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి పనులు ప్రారంభించాలన్నారు. ఆలస్యం చేస్తే సమయం దగ్గర పడుతుందనే భావనలో నాసిరకం పనులు చేసే ఆస్కారం ఉంటుందన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ఇక నుంచి ప్రతీవారం మేడారం జాతర పనులపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అధికారుల తమ ప్రగతి నివేదికతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఈ సమీక్షలో ఐటీడీఏ పీవో తరువాయి 2లో

## నేటినుంచి భారత్-శ్రీలంక సైనిక విన్యాసాలు

పుణె : భారత్, శ్రీలంక సైనిక విన్యాసాలు శుక్రవారం నుంచి పుణెలో ప్రారంభం కానున్నాయి. దేశీయంగా ఉగ్రవాద దాడులను సమర్థంగా ఎదుర్కోవడమే లక్ష్యంగా ఇరుదేశాల సైనికులు ఈ విన్యాసాలను నిర్వహించనున్నారు. మిత్రశక్తి ఐదో ఎడిషన్ సైనిక విన్యాసాలు 13 రోజులపాటు జరగనున్నాయి. నాల్గో విడత సైనిక విన్యాసాలు గతేడాది శ్రీలంకలో జరిగాయి. రెండు దేశాల మధ్య రక్షణ రంగాల్లో సహకారమే లక్ష్యంగా 2013 నుంచి భారత్, శ్రీలంకలు సంయుక్తంగా సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నాయి.






## టేకిట్ ఈజీ



**తన వెంట పాదయాత్రలకు జగన్ మిమ్మల్ని పిలవకూడదనేగా... మీ పూజలు.. మొక్కులూ... !!**

## ఆత్మవిశ్వాసమే విజయ పతాక

### బాలికా దినోత్సవంలో పోలీసు ఉన్నతాధికారుల పిలుపు



హైదరాబాద్: విద్య, విజ్ఞానంతో అద్భుతాలు సృష్టించొచ్చు. బాలికలు చదువుకోవాలి. అంటూ పోలీసు ఉన్నతాధికారులు, యూనిసెఫ్ ప్రతినిధులు విద్యార్థినులకు పిలుపునిచ్చారు. సాధారణ కుటుంబానికి చెందిన మలాలాను ప్రస్తుతం విశ్వవ్యాప్త విశ్వవిద్యాలయాలు చదువు చెప్పేందుకు ఆహ్వానిస్తున్నాయంటే బాలికా విద్య కోసం ఆమె చేస్తున్న పోరాటాన్ని అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధించవచ్చన్నారు. షిటీమ్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో తరువాయి 2లో

# జనం మధ్య చిచ్చుపెడుతున్న భాజపా



గంగావతి : కనకగిరి, కారటగి తాలూకాలు కాకుండా అడ్డుకునేందుకు భాజపా నేతలు జనం మధ్య చిచ్చుపెడుతున్నారని శాసనసభ్యుడు శివరాజ్ తంగడిగి ఆరోపిం చారు. కనకగిరి నియోజకవర్గంలోని హేరూరులో ఆయన ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సౌకర్యం కోసం గంగావతిని విభజించి రెండు కొత్త తాలూకాల కోసం తాను ప్రయత్నించి సాధించినట్లు చెప్పారు. ఇది మింగుడు పడని భాజపా నేతలు ప్రజలను తప్పు దోవ పట్టించి సమ్మె చేయిస్తున్నారన్నారు. జనం వారి కుతంత్రాలను గుర్తించి గుణపాఠం నేర్పాలన్నారు. ఎడమకాల్వ సాగునీరు విషయాన్ని సైతం రాజకీయం చేశారన్నారు. రైతుల సమ్మె చేస్తున్న చోటికి తాను వెళ్లగా గొడవ చేశారన్నారు. కానీ ఐ.సి.సి. సమావేశాల్లో గట్టిగా వాదించి నీరు విడుదల చేయించినట్లు చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కనకగిరిలో భాజపాకు 12 వేల ఓట్ల ఆధిక్యం ఇచ్చినా ఎం.పి. సంగణ్ణ కరడి చేసింది శూన్య మన్నారు. ఇంటింటికీ వచ్చే భాజపా విస్తారకులను ఈ విషయమై నిలదీయాలన్నారు. కేంద్ర ఉజ్వల పథకానికి దీటుగా రాష్ట్ర ప్రభుత్వం అనిలభాగ్యను ప్రవేశపెట్టి అందరికీ వంటగ్యాస్ పంపిణీ చేయనుందని చెప్పారు. అసత్యాలను ప్రచారం చేసే భాజపా నేతలను నమ్మరాదన్నారు. ఈ కార్యక్రమంలో కె.పి.సి.సి. కార్యదర్శి ఉమేశ్, రెడ్డి శ్రీనివాస్, అమరేశ్‌గోనాళ, లక్ష్మమ్మ నీర్లూటి పాల్గొన్నారు.

## బడుగులపై ఆగని దౌర్జన్యకాండ

బెంగళూరు : దేశంలో దళితులపై కొనసాగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బెంగళూరులోని మైసూరుబ్యాంకు కూడలిలో దళిత హక్కుల పోరాట సమితి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లోనే బడుగులకు రక్షణ లేకుండా పోయిందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయజనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గోరక్షణ పేరుతో దాడులు చేయడం ఆందోళనకరమని ఖండిం చారు. దళిత మహిళలపై అత్యాచారాలకు పాల్పడు తున్నారని వాపోయారు. కర్ణాటకలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవని వాపోయారు. బలహీనులపై దౌర్జన్యాలు కొనసాగు తున్నా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. వారికి కనీస రక్షణ మేడిపండు చందంగా మారిందన్నారు. నేటికీ కొన్ని గ్రామాల్లో అంటరానీతనం రాజ్యమేలు తోందని గుర్తుచేశారు. దాడుల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమితి కీలక నేతలు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

## ప్రాచీన ఆలయానికి కొత్తరూపు

మైసూరు : శిథిలమైన ప్రాచీన ఆలయానికి యువత కొత్తరూపునిచ్చారు. మైసూరు జిల్లాలోని నంజనగూడు సమీపంలోని కాత్వాడి పుర గ్రామంలోని శివాలయం పాడుపడింది. దీన్ని గుర్తిం చిన యువత స్థానిక పంచముఖి ఆంజనేయస్వామి ట్రస్ట్ సహకారంతో జీర్ణోద్ధరణ పనుల్ని చేపట్టారు. ఆలయం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల్ని తొలగించారు. ఆలయం పైభాగంలో మరమ్మతులు చేశారు. యువత శ్రమదానం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పూందమల్లి హైరోడ్డు పునరుద్ధరణకు రూ.13 కోట్లు

విల్లివాక్కం : పూందమల్లి హైరోడ్డు పునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.13 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. చెన్నై మదురైవాయల్ - కోయంబేడు మధ్య పూందమల్లి హైరోడ్డు 4.12 కిలోమీటర్ల పొడవు ఉంది. రాష్ట్ర రహదారుల శాఖ ఆధ్వర్యంలోని ఈ రోడ్డును 2009లో జాతీయ రహదారుల కమిషనరేట్‌కు అప్పగించారు. మదురైవాయల్ - హార్బర్ వంతెన రోడ్డు పథకానికి ఇక్కడ పిల్లర్లు నిర్మించారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయంతో జాతీయ రహదారుల కమిషనరేట్ పునరుద్ధరణ పనులను వదులుకుంది. దీంతో రోడ్డు గుంతలు పడి వాహన రాకపోకలకకిబ్బందిగా మారింది. కోయంబేడు నుంచి పలు జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు నడుపుతున్న ప్రభుత్వ బస్సులు ఈ మార్గంలోనే వెళ్లాలి. ఈ నేపథ్యంలో దీనిని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల కమిషనరేట్‌ను కోరింది. దాంతో రహదారి పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.13 కోట్లు కేటాయిం చిందని, త్వరలో టెండర్లు పలిచి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

## ఆనందమయ జీవితం గడపాలి

రాయగడ : వయోవృద్ధులమయిపోయాం... ఇంక ఏమి చేయగలమన్న భావన విడనాడి ఉత్సాహంగా... ఆనందంగా జీవన కార్యాచరణ ప్రణాళికలతో వృద్ధులు ఉండాలని జిల్లా పాలనాధికారిణి పూనంగుహ ఆకాంక్షించారు. పురపాలక సంస్థ టౌన్‌హాల్‌లో జరిగిన ప్రపంచ వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసం గించారు. జిల్లా సామాజిక సురక్ష విభాగం అధికారి ఆదికొంద కోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ పి.ఆర్. గౌరవ అతిథిగా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వై.జగన్నాథరావు, డీఎస్పీ శాంతనుమహంతి పాల్గొని సీనియర్ సిటిజన్ చట్టాలు, రక్షణ అనే అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ స్టేట్ హెడ్ భారతి చక్ర పాల్గొని రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా అన్ని జిల్లాల్లో వయోవృద్ధుల సంక్షేమం కోసం వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు.

అనంతరం 2009 వయోవృద్ధుల చట్టంపై ప్రసంగించారు. సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు బినోద్‌చంద్రపండా, పుర పాలక సంస్థ ఉపాధ్యక్షుడు నిరంజన్‌ప్రసాద్ భక్షిపాత్ర్, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## చెక్ పారిశ్రామికవేత్తలతో చర్చలు



బెంగళూరు: రాష్ట్రంలో పెట్టుబడుల నిమిత్తం చెక్ రిపబ్లిక్ మహిళా పారిశ్రామిక వేత్తలతో రాష్ట్ర బృందం చర్చలు జరిపింది. చెక్ రిపబ్లిక్‌లోని బ్రూనోలో నిర్వహిస్తున్న అంత ర్జాతీయ ఇంజినీరింగ్ సమ్మేళనంలో భాగంగా రాష్ట్ర భారీ, మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఆర్.వి.దేశ్‌పాండే, రాష్ట్ర అదనపు ముఖ్య కార్యదర్శి రత్నప్రభ తదితరులు ఈ పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో కర్ణాటక మహిళా పారిశ్రామిక వేత్తలు, జెనీ ఎస్‌ఆర్‌ఓ వ్యవస్థాపకురాలు ఈవా సెజ్‌కోవా తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం

బరగఢ్ : బరగఢ్ జిల్లా అత్తాబీరా కోస లాంధ్ర సంఘ కల్యాణ మండపంలో తెలుగు నాటక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలుగు భాషా, సాంస్కృతిక శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున 15 మంది కళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. కోసలాంధ్ర సంఘ సీనియర్ సభ్యులు ఎం.వీర్రాజు, జి.సూర్యనారాయణ తదితరులు దీప ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు.

జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు హాజరై నాటకాన్ని తిలకిం చారు. కోసలాంధ్ర సంఘ అధ్యక్షుడు డి.మురళీ కృష్ణ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. సంఘం కోరిక మేరకు ఆంధ్ర ప్రభుత్వం కళాకారులను పంపడం అభినందనీయమన్నారు. కృష్ణుడిగా బంగారు భాస్కరరావు, కర్ణుడిగా రెడ్డి తిరుపతి నాయుడు, అశ్వద్ధామగా అప్పారావులు పాత్రలు మనోరంజకంగా నిలిచాయి. బి.బి.చౌదరి, దొర బాబు. కె.శ్రీనివాసరావు తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి





బళ్లారి : మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం సౌకర్యాలను అందిపుచ్చుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని బళ్లారి పారిశ్రామిక వాణిజ్య మండలి మహిళా విభాగం అధ్యక్షురాలు సి.పద్మావతి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. జిల్లా యంత్రాంగం, బళ్లారి పారిశ్రామిక శాఖ, పారిశ్రామిక, వాణిజ్య మండలి సంయుక్తాధ్వర్యంలో స్థానిక అనంతపురం రహదారిలోని బి.డి.ఎ.ఎ. సభాభవనంలో మహిళా పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక రాజ్య మహిళా అబివృద్ధి నిగమను ప్రారంభించింది. అదే విధంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం బళ్లారి తాలూకా కుడతిని గ్రామంలో 100 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి అభివృద్ధి చేసిందని పద్మావతి అన్నారు. ఇప్పటికే రాష్ట్ర అదనపు కార్యదర్శి రత్నప్రభ భూమిని పరిశీలించారని చెప్పారు. కుడతినిలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఉద్యానవన పార్కులో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు మహిళలు ముందుకు వస్తే 25 సెంట్ల నుంచి రెండు ఎకరాల వరకు కేటాయిస్తారన్నారు. రహదారులు, మురుగుకాల్వలు, విద్యుత్తు సౌకర్యం, రవాణా, తాగునీటి వ్యవస్థ తదితర సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. ఎలాంటి హామీ లేకుండా 4 శాతం వడ్డీతో రుణాలు కూడా అందజేస్తోందని, మహిళలు సద్వినియోగం చేసుకుని బళ్లారిని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. పారిశ్రామిక శాఖాధికారి మంజునాథగౌడ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి మంజునాథ, రాజశేఖర్, మహిళా-శిశు అభివృద్ధి శాఖాధికారి నాగేష్ బిల్వా తదితరులు హాజరయ్యారు.

# ఖాతాదారులకు నాణ్యమైన సేవలే లక్ష్యం



**మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్**

చెన్నై : ఖాతాదారులకు నాణ్యమైన సేవలం దించడమే తమ లక్ష్యమని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ పేర్కొన్నారు. కోయంబత్తూరులోని ఒక ప్రైవేటు హోటల్‌లో మార్గదర్శి చిట్స్ సిబ్బందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో సిబ్బందికి విధినిర్వహణలో ఖాతా దారులకు అన్నివిధాలుగా నాణ్య మైన సేవలు అందించడానికి దోహదపడే అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో తమిళనాడులోని కోయం బత్తూరు, ఈరోడ్, సేలం, వేలూరు, కరూర్, మదురై, తిరుచ్చి, తిరుప్పూరు జిల్లాల్లోని మార్గదర్శి శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ మాట్లాడుతూ... సిబ్బందికి విలువైన సూచనలు చేశారు. రాష్ట్రంలో ఏటికేడు ఖాతాదారుల సంఖ్య పెరుగుతోందని, అందుకు అనుగుణంగా వారికి నాణ్యమైన సేవలు అందిం చడానికి సంస్థ అన్ని రకాలైన చర్యలు చేపడు తోందన్నారు.

ఈ తర గతుల్లో నేర్చుకున్న అంశాలను ఆచర ణలో పెట్టి సంస్థ అభివృద్ధికి దోహదపడా లన్నారు. నమ్మకం, నిజాయతీ, క్రమ శిక్షణతో ఖాతాదారులకు సేవలందిం చాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్య క్రమంలో మార్గదర్శి తమిళనాడు విభాగం జీఎం శ్రీధర్‌నాయుడు, డీజీఎం బల రామకృష్ణ, ఎల్ శ్రీనివాసరావు, మార్గదర్శి సీనియర్ మేనేజర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

### ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ఉంటుందని, దీన్ని తుది ఏడాది బీటెక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్నప్పటినుంచి మూడు మాసాలపాటు ఈ శిక్షణ ఆన్‌లైన్‌లో ఉంటుందని తెలిపారు. జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టాలెంట్ స్ప్రింట్ సూపర్ క్యాంపస్ డైరెక్టర్ సి.గిరిధరన్, ఉపాధ్యక్షుడు ఫాజల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### నష్టపోయిన పంటల పరిశీలన

మునకకు గురైన పంటలను చూశారు. ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే రత్నంకు స్థానిక రైతులు సమస్యలను ఏకరవు పెట్టారు. చిన్నపాటి వర్షం పడితే ఈసీ వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నట్లు.. దీంతో చుట్టుపక్కల ఉన్న పంటలు పూర్తిగా మునకకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కాలంగా తాము నష్టపోతున్నప్పటికీ.. పరిహారం మాత్రం అందడం లేదని విన్నవించారు. పంట నష్టంపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

### ఆత్మవిశ్వాసమే విజయ పతాక

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సదస్సు నిర్వహించారు. బాలిక విద్య, రక్షణపై ఆయా శాఖల ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి పోలీసులు రూపొందించిన షీటీమ్స్ ఫర్‌యూ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. డీసీపీ అవినాష్ మొహంతి, పోలీస్ అధికారులు రంజన్‌రతన్‌కుమార్, డి.కవిత, నిలోఫర్ ఆసుపత్రి వె%ద్యాధికారి హిమబిందు, తరుణి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి మమతా రఘువీర్‌లు హాజరయ్యారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సాధికారతకు మీరే చిరునామా

మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్

మహిళా సాధికారత, బాలికా విద్య ఇవన్నీ నినాదాలకే పరిమితం కాకూడదు. నిజమైన సాధికారతకు మీరే చిరునామాగా మారాలి. చదువుకోవడం నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నతంగా ఎదిగేందుకు అన్ని అవకాశాలున్నాయి. భౌతికంగా, మానసికంగా మీపై ఎవరైనా దాడులు చేస్తే మాకు చెప్పండి. మీ రక్షణ బాధ్యతమాది. ఏటా అంతర్జాతీయ బాలికా దినోత్సవం జరుపుకొంటున్నా... ఈసారి ప్రత్యేకత ఉంది. విజన్ 2030 పేరుతో ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలి.

పోలీసు అవ్వండి.. సమాజాన్ని మార్చండి

స్వాతి లక్రా, అదనపు పోలీసు కమిషనర్ (నేర పరిశోధన)

దేశంలో బాలికలకు అవసరమైంది విద్య, ఆరోగ్యం, రక్షణ... ఈ మూడు అంశాలు గతంలో కన్నా మెరుగ్గా ఉన్నాయి. మీరు బాగా చదువుకుని పోలీసు అధికారిగా మారితే బాలికలు, మహిళలపై నమోదవుతున్న నేరాలకు అడ్డుకట్ట పడుతుంది. తెలంగాణ రాష్ట్రం పోలీసు శాఖలో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది. మరోవె%పు దేశవ్యాప్తంగా మహిళా సంబంధ నేరాలు, విద్యార్థినులు, బాలికలపై అత్యాచారయత్నాలు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి. వీటి నుంచి రక్షించేందుకు కొత్తగా షీటీమ్ ఫర్‌యూ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించాం.

### మేడారం జాతర పనుల్లో వేగం పెంచాలి

చక్రధర్‌రావు, ములుగు సబ్ కలెక్టర్ గౌతమ్, సీపీవో కొంరయ్య, ఈఈలు నిర్మల, రమేశ్, కోటిరెడ్డి, శంకరయ్య, జిల్లాస్థాయి అధికారులు ఎర్రయ్య, రవికుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ పరిధిలోకీ రియల్ ఎస్టేట్!

ఆ రంగాన్ని కూడా జీఎస్టీ కిందకు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జైట్లీ తెలిపారు. జీఎస్టీ మండలి నిర్వహించే తదుపరి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంటామన్నారు. గువాహతిలో నవంబర్ 9వ తేదీన తదుపరి జీఎస్టీ సమావేశాలు జరగనున్నాయి. నగదు మార్పిడి ఎక్కువగా రియల్ ఎస్టేట్ రంగంలో జరుగుతున్నదని, అక్కడే ఎక్కువ శాతం పన్ను కూడా ఎగవేస్తున్నారని, రియల్ ఎస్టేట్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయని, రియల్‌ను జీఎస్టీ కిందకు తీసుకురావాలని తాను కూడా గట్టిగా విశ్వసిస్తున్నట్లు జైట్లీ చెప్పారు. వచ్చే నెలలో జరిగే జీఎస్టీ సమావేశంలో ఈ అంశాన్ని చర్చిస్తామన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలు.. రెండు అభిప్రాయాలు వినిపిస్తున్నాయని, అందుకే దానిపై చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బిల్డింగ్ నిర్మాణాలపై 12 శాతం జీఎస్టీ వసూల్ చేస్తున్నారు. అయితే భూమి, స్థిరాస్తులపై మాత్రం జీఎస్టీ లేదు. నోట్లు రద్దు అనేది ప్రాథమిక సంస్కరణ అని, దేశాన్ని పన్ను ఎగవేత నుంచి ఆదుకునేందుకు తీసుకున్న చర్య అని జైట్లీ తెలిపారు.

### బాణసంచా..

ఇచ్చిన తాత్కాలిక లైసెన్సులు కూడా రద్దయినట్టేనని ఆయన చెప్పారు. నవంబర్ 1వ తేదీ వరకూ ఢిల్లీ, ఎన్సీఆర్ రీజియన్‌లో బాణసంచా అమ్మకాలపై నిషేధాన్ని పునరుద్ధరిస్తున్నట్టు అత్యున్నత న్యాయస్థానం గతం సోమవారంనాడు తీర్పుచెప్పింది. దీపావళి సీజన్‌లో వాతావరణ కాలుష్య స్థాయిని దృష్టిలో పెట్టుకుని కోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.

### ముందుగా యుద్ధానికి నిప్పు పెట్టింది ట్రంపే

చేరుకోవడంలో మేం చివరి దశలో ఉన్నాం. మా నియమం ఒక్కటే.. మా అణ్వాయుధాల గురించి చర్చలు వస్తే వాటిపై మాట్లాడేందుకు మేం ఎప్పటికీ అంగీకరించం అని రి యాంగ్ హో అన్నారు. గత కొద్ది రోజులుగా అమెరికా, ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వరుస క్షిపణి ప్రయోగాలతో పొరుగు దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఉత్తరకొరియా ఆగడాలను అరికట్టేందుకు అమెరికా ప్రయత్నాలు చేపట్టింది. ఇప్పటికే ఆ దేశంపై కఠిన ఆంక్షలు విధించేలా ఐరాసలో అమెరికా పెట్టిన తీర్మానానికి ఆమోదం లభించిన విషయం తెలిసిందే.

### తల్లిదండ్రులు నిర్దోషులు

పట్టించడానికి పోలీసులే ఇలాంటి అభియోగాలు మోపారంటూ తల్వార్ దంపతులు వాదించారు. దీంతో 2008లో నాటి ఉత్తరప్రదేశ్ సీఎం మాయావతి ఈ కేసును సీబీఐకి అప్పగించారు. అనేక మలుపులు తిరిగిన అనంతరం సీబీఐ ప్రత్యేక కోర్టు అందుబాటులో ఉన్న సాక్ష్యాల ఆధారంగా.. ఆరుషి తల్లిదండ్రులను ప్రాసిక్యూట్ చేయాలని ఆదేశించింది.

ఆరుషి హత్య కేసులో 2013లో ఆమె తల్లిదండ్రులకు జీవిత ఖైదు పడింది. యూపీ పోలీసులు 2008 మే 23న రాజేష్‌ను అరెస్టు చేసి దస్నా జైలుకు పంపారు. అనంతరం 2012లో రాజేష్ బార్య నుపూర్.. ఘజియాబాద్ కోర్టులో లొంగిపోవడంతో ఆమెను కూడా దస్నా జైలుకు పంపారు. ప్రస్తుతం ఈ కేసు నుంచి వీరికి ఊరట లభించడంతో.. తక్షణమే జైలు నుంచి విడుదల కానున్నారు.

### శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తివేత

*పూజలు నిర్వహించారు. అనంతరం రెండు గేట్లు ఎత్తి 56 వేల క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఒక్కో గేటును 10 అడుగుల మేర ఎత్తారు.*

*ప్రస్తుతం శ్రీశైలం జలాశయ నీటి మట్టం 884.80 అడుగులతో 214.8450 టీఎంసీలుగా ఉంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి 1,39,007 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,878 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 42,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 12,000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1600 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 338 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే బాలరాజు పాల్గొన్నారు.*

## పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి

చెన్నై : గుజరాత్, మహారాష్ట్ర తరహాలో పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో... అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర తగ్గుతున్న నేపథ్యంలో భాజపా ప్రభుత్వం రోజువారీ ధర నిర్ణయ విధానంతో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచుతోందన్నారు.

ఇలా ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందని ఆరోపించారు. కేంద్ర చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఖండించడం లేదని తెలిపారు. నిరుపేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

## ఆశ్రమాలకు ఐటీడీఏ నుంచి రుతు రుమాళ్లు పంపించాలి

భద్రాచలం : మన్యంలోని గిరిజన విద్యార్థులకు ప్రభుత్వపరంగా ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నందున చక్కగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఏపీవో జనరల్ భీమ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు, భద్రాచలం ఐటీడీఏలకు శానిటరీ నాప్కిన్ తయారీ యూనిట్లు మంజూర య్యాయని అందులో భాగంగా భద్రాచలంలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలికల ఆశ్రమాలకు ఇకనుంచి ఇక్కడి నుంచి నాణ్యమైన నాప్కిన్లు అనుకూలమైన ధరకు అందించాలన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి యంత్రాలను తెప్పించి వాటిని ఎలా ఉపయోగించాలో నిపుణులు వివరించారు. రూ.5 లక్షలను ప్రభుత్వం అందించగా గిరిజన మహిళా సంఘాలలోని 10 మంది సభ్యులు రూ.50 వేలను లబ్ధిదారు వాటాగా చెల్లించి ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీనెల 2500 నుంచి 4 వేల కిట్లు తయారీ చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల



గుడిపేట : వారం రోజులుగా ఎగువప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు హాజీపూర్ మండలం గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి జలాశయంలో వరద ఉద్ధృతి రోజురోజుకు భారీగా పెరుగుతోంది. దీంతో జలాశయం అధికారులు గేట్లను ఎత్తివేసి కొద్దిరోజులుగా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. తాజాగా జలాశయంలోకి మరింత వరద పెరగడంతో బుధవారం మూడు గేట్లు ఎత్తివేసి 9586 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలాశయం ఈఈ వేణుగోపాల్‌రావు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 147.84 మీటర్ల మేరకు వరద చేరింది. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 19.730 టీఎంసీల నీరు చేరిందని ఆయన తెలిపారు. ఎగువ నుంచి జలాశయంలోకి ఇన్‌ఫ్లో 5739 క్యూసెక్కుల వరద వస్తుండగా జీహెచ్‌ఎంసీ తాగునీటి అవసరాల కోసం 220 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, సింగరేణి అవసరాల కోసం 90 క్యూసెక్కులతో పాటు మూడు గేట్ల ద్వారా 9 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గోదావరిలోకి నీటిని ఎక్కువగా విడుదల చేసినందున తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## పెట్రోలియం డీలర్ల సమ్మె జయప్రదానికి వినతి

కొత్తగూడెం : పెట్రోలియ డీలర్ల సమస్యలపై స్పందించని ఆయిల్ కంపెనీల వైఖరికి నిరసనగా ఈ నెల 13న పెట్రోలియం డీలర్ల దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు జిల్లా పెట్రోలియం డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు ధరావత్ చందు నాయక్ తెలిపారు.

ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో డీఆర్‌వో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. చందునాయక్ మాట్లాడు తూ కేంద్రం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తూ పెట్రోల్ బంక్ నిర్వాహకులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మూడు నెలలుగా రోజువారి ధరల కార్యక్రమాన్ని ప్రవేశపెడుతూ డీలర్లకు నెలకు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు నష్టాన్ని కల్గిస్తుందన్నారు. బంకుల్లో సరైన నిల్వలను నిర్వహించలేక రోజువారి నష్టాన్ని భరించలేక పలువురు డీలర్లు అప్పులపాలవుతున్నారన్నారు. దేశస్థాయిలో ఉన్న మూడు జాతీయ సంఘాలు యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడి ఈ నెల 13న దేశవ్యాప్తంగా 54వేల పెట్రోలు బంక్‌ల బంద్‌కు పిలుపునిచ్చారన్నారు. బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి డి.రాధాకృష్ణ, రవిరామ్, జానిమియా, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 కోట్లతో వెల్‌నెస్ సెంటర్



సంగారెడ్డి : జర్నలిస్టులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం రూ.50 కోట్లతో సంగారెడ్డిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలోని జర్నలిస్టులకు రెండు పడకల ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా జర్నలిస్టుల సంక్షేమంపై సుముఖంగా ఉన్నట్లు వివరించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్ అమర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని చెప్పారు. నవంబర్ 17-19 తేదీలలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధురలో జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ ఎన్నికయ్యారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, కార్యదర్శి ఫైజల్, ఐజేయూ సభ్యులు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు సముచిత స్థానం

ఎదులాపురం : తెరాస రాష్ట్ర కార్యవర్గంలో ముదిరాజ్‌లకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, జిల్లా అధ్యక్షుడు సలెందర్ శివయ్య పేర్కొన్నారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్‌ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శులుగా అందెబాబన్న, సహదేవ్, సహాయ కార్యదర్శిగా ముఖేష్‌లను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాధికారం కోసం ముదిరాజ్‌లు చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని వారు పేర్కొన్నారు. సమావేశంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు దారవేణి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొమ్మెన లస్మన్న, జిల్లా కార్యదర్శి ఈగల పొచ్చన్న, నాయకులు బి.నర్సింగ్, ఓరగంటి శ్రీనివాస్, ఇండ్ల భూమన్న, బుట్టి శివకుమార్, దొంతుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మినుములు కొనుగోళ్లు చేస్తాం..

భైంసా : భైంసా పట్టణంలోని మినుముల కొనుగోలు కేంద్రంలో ఈ ప్రాంత రైతులకు చెందిన మినుములన్నింటినీ కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ ఇన్‌ఛార్జి డీఎం కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యమాక ఉ.శ్రేణి కార్యదర్శి సంగయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, తెరాస నాయకుడు గౌర శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ చోటుచేసుకున్న పరిణామాలతో మార్క్‌ఫెడ్ జిల్లా ఇన్‌ఛాథర్జి డీఎంగా ప్రభుత్వం తనకు బాధ్యతలు అప్పగించిందన్నారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా భైంసా, కుభీరు కొనుగోలు కేంద్రాలలో ఈ నెల 12 నుంచి కొనుగోళ్లు పునరుద్ధరిస్తామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చేందాల్సిన పనిలేదని ప్రతి మినుము గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు మినుములను ఆరబెట్టి శుభ్రంచేసి తీసుకురావాలని కోరారు.

## స్వాహా సొమ్ము రికవరీ: మువ్వా

ఖమ్మం : డీసీసీబీ వైరా బ్రాంచిలో స్వాహాకు గురైన సొమ్మును అతి తక్కువ సమయంలో రికవరీ చేసినట్లు డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయబాబు చెప్పారు. ఖమ్మంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన పిల్లి సతీశ్ ఖాతాదారుల అక్కౌంట్ల నుంచి భారీగా నగదును డ్రా చేశాడు. దీనిపై త్రిసభ్య కమిటీ బృందం పూర్తిగా విచారణ జరిపి రూ.40.34లక్షలను ఖాతాదారుల అసలు నుంచి అక్రమంగా డ్రా చేసినట్లు గుర్తించారు. నగదును డ్రా చేసిన దగ్గరి నుంచి ఇప్పటి వరకు రూ.1.22లక్షలు వడ్డీతో సహా కలిపి మొత్తం 41.51లక్షలను సతీశ్ నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు.

## డయల్ యువర్ ఆర్ఎంకు 22 ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సమస్యలపై మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి 22 ఫిర్యాదులు వచ్చాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు గంట పాటు ఈ కార్యక్రమంలో ఆర్ఎం వినోద్‌కుమార్ ఫిర్యాదులను స్వీకరించి సమాధానాలు ఇచ్చారు. బాదేపల్లి నుంచి దేవరకద్ర వరకు నడుస్తున్న మినీ పల్లెవెలుగు బస్సులను మరికల్ వరకు కొనసాగించాలని, వీపనగండ్ల నుంచి కర్నూలుకు ప్రత్యేక బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారు. నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్‌కు సాయంత్రం వేళల్లో బస్సుల ట్రిప్పులు పెంచాలని, ప్రస్తుతం నడుపుతున్న గుర్మిట్కల్ యానగుందే బస్సును రద్దు చేసి దాని స్థానంలో రెండు తలుపుల బస్సు నడపాలని, శాంతినగర్ నుంచి అలంపూర్ మార్గంలో బస్సులు నడపాలని, బిజినేపల్లి భూత్పూర్ మధ్య బస్సులు నడపాలని ఇలా వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ప్రయాణికుల ఫిర్యాదులను స్వీకరించిన ఆర్ఎం వినోద్‌కుమార్ వాటి పరిష్కారానికి హామీలు ఇవ్వడంతో పాటు ఫిర్యాదులను నమోదు చేశారు. బాదేపల్లి- దేవరకద్ర మధ్య నడిచే సర్వీసులు మినీ బస్సులు కావడం వల్ల మరికల్ వరకు నడపడం కుదరదని, అవసరమైతే ఇతర బస్సులను మరికల్ వరకు కొనసాగిస్తామన్నారు.

## వేదమంత్రాలు..మేళతాళాలు.. కలెక్టరేట్, కమిషనరేట్‌కు శంకుస్థాపన



కొండపాక: ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించారు. కొండపాక మండలం నాగులబండ వద్ద సమీకృత కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ భవన పనులకు శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణోత్తముల వేద మంత్రాలు, మేళతాళాల నడుమ భూమి పూజ చేశారు. తర్వాత శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్, కమిషనరేట్ భవనాల నమూనాలను కేసీఆర్ పరిశీలించారు. తర్వాత సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి పరిధిలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు, శాసనసభ ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ అనురాగ్‌శర్మ, ఎంపీలు వినోద్, బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యేలు సోలిపేట రాంలింగారెడ్డి, సతీష్, రసమయి బాలకిషన్, మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, పాతూరి సుధాకర్ రెడ్డి, రాములు నాయక్, భూపాల్‌రెడ్డి, సీఎంఓ అదనపు కార్యదర్శి స్మితసబర్వాల్, వైద్యారోగ్య శాఖ సంచాలకులు కరుణ, కార్పొరేషన్ ఛైర్మన్లు నర్సారెడ్డి, భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, బల్దియా ఛైర్మన్ రాజనర్సు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ వాస్తు సలహాదారుల సుద్దాల సుధాకర్‌తేజ పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పాల్వంచగ్రామీణం : 220కేవీ, 400 కేవీ విద్యుత్ లైన్లలో టవర్లు ఎక్కుతూ ప్రమాదకరమైన పనులు చేస్తున్న సీబీడీ(సెంట్రల్ బ్రేక్ డౌన్‌గ్యాంగు) కార్మికులను ప్రభుత్వం ఆర్టిసన్ గ్రేడ్-1 గుర్తించింది. విద్యార్హతలతో సంబంధం లేకుండా అందరిని గ్రేడ్-1 ఆర్టిసన్‌గా గుర్తించడంతో రూ.10వేల నుంచి రూ.17,700లకు వేతనం పెరిగింది. కృతజ్ఞతగా టీఎస్ ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రేడ్-1 కార్మికులుగా గుర్తించడానికి కృషి చేసిన సీఎండీ ప్రభాకర్‌రావు, ఇంధన మంత్రి జగదీశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీబీడీ గ్యాంగ్ సభ్యులు మాట్లాడుతూ బంగారు తెలంగాణలో విద్యుత్తు సేవలు అందించడానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడుగు ఉపేందర్, పతంగి ఉపేందర్, ఏడుకొండలు, కృష్ణ, శ్రీను, నరేష్, కాంతారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల గొంతు నొక్కడం తగదు : డీసీసీ

వెల్దండ : ప్రజాసమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతులను నొక్కడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదని కాంగ్రెస్ పార్టీ(డీసీసీ) జిల్లా అధికార ప్రతినిధి కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వెల్దండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు ప్రజల పక్షాన పోరాటాలు చేసే, ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలకు ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతును నొక్కేందుకు కంకణం కట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విదేశీ సంస్థలతో చేతులు కలిపి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఫార్మసీ సంస్థలకు అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బంగారు పంటలు పండే రైతుల పొలాలను సాధారణ ధరలకు రైతుల నుంచి బలవంతంగా లాక్కొంటూ వారిని బజారున పడేస్తున్నాయన్నారు. రైతుల ఆమోదంలేకుండా భూములను తీసుకోవద్దని కోర్టులు ఆదేశించినా ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కుతూ ప్రత్యేక జీవోలతో భూములను వారి నుంచి తీసుకోవడం తగదన్నారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలకు స్వస్తి పలికి ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి పోరాటా లకు సిద్ధమవుతున్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచి ముత్యాలు, కాంగ్రెస్ నాయకులు చంద్ర మోహన్‌రెడ్డి, మోతీలాల్, తిరుపతిరెడ్డి, శ్రీను, శేఖర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందులో కుమురం భీం విగ్రహావిష్కరణ

### గిరిజన సంప్రదాయ నృత్యాలతో ప్రదర్శన



ఇల్లెందు : ఆదివాసీల హక్కులు, జీవనాభివృద్ధి కోసం కుమురం భీం నిర్వహించిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీలంతా ఐక్య ఉద్యమాలను నిర్వహించాల్సిన సమయం అసన్నమైందని ఆదివాసీ సంక్షేమ పరిషత్(తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో 11 అడుగుల కుమురం భీం విగ్రహావిష్కరణను సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముందుగా మార్కెట్ యార్డు నుంచి భారీ ప్రదర్శనను గిరిజన సంప్రదాయ కళారూపాలు, నృత్యాలతో ప్రదర్శన ప్రధాన వీధుల మీదుగా చేపట్టారు. అనంతరం కొత్తబస్టాండ్ వద్ద విగ్రహాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంపిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కేవలం విద్యతోనే సాధ్యమవుతోందనీ, ప్రతీ ఒక్కరు కుటుంబంలో ప్రభుత్వం ఉచితంగా ప్రవేశపెట్టిన కేజీ నుంచి పీజీ విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ దేశంలో అత్యంత దోపిడీకి గురవుతున్న వారు ఆదివాసీలేనని అన్నారు. మన్యం ప్రాంతాల్లో వారికి కల్పించిన చట్టబద్ధమైన హక్కుల కోసం ప్రశ్నించిన సంఘాలను సంఘ విద్రోహశక్తులుగా నేటి పాలకులు చూస్తున్నారు ఆరోపించారు. 5షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకే సర్వ హక్కులుంటాయన్నారు. ఆదివాసీలు పోడు చేసుకోని జీవనం సాగిస్తుంటే గ్రామాల నుంచి తరివివేసేందుకు పాలక ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. జీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు సోంది వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీలను రాజకీయ పార్టీలు ఓట్ల కోసం మాత్రమే వాడుకుంటున్నాయనీ, వారి అభివృద్ధి, మన్యం చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం లేదని విమర్శించారు. జల్, జంగల్, జమీన్ రావాలంటే ఆదివాసీలకీ చెందిన ప్రజాప్రతినిధులు చట్టసభల్లో గొంతెత్తాలన్నారు. అనంతరం ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావి వర్గం, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఈసం నారాయణ, చింత రమేశ్, వట్టం కన్నయ్య, గొగ్గెల రామస్వామి, జువ్వాజి లక్ష్మీనారాయణ, తాటి భిక్షం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### గాడిలో పడని పాలన: సీపీఎం

ఇల్లెందు : జిల్లా ఏర్పడి ఏడాదైనా వర్గపోరు వల్ల అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని సీపీఎం జిల్లా నాయకుడు ఏజే రమేశ్ అన్నారు. భద్రాద్రి జిల్లాకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లేరనీ, ప్రధానమైన కీలకపోస్టులు ఖాళీగా ఉండడంతో పాలన కుంటుపడుతోందని ఆరోపించారు.

## అసమర్థ పాలనలో సంబురాలా?: కాసాని



కొత్తగూడెం : జిల్లాలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయినా పట్టించుకోని అసమర్థ పాలనలో అంబరాన్నంటే సంబురాలు ఎలా నిర్వహిస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య ప్రశ్నించారు. జిల్లా ఆవిర్భావ వేడుకలు చేసుకోవడంలో అర్థం లేదని విమర్శించారు. స్థానిక మంచికంటిభవన్‌లో ఏర్పాటైన జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడుతూ నూతన జిల్లాలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయన్నారు. ఏం సాధించారని ప్రభుత్వం యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సంబురాలు చేస్తున్నారంటూ విమర్శించారు. ప్రజాధనం దుర్వినియోగం తప్పితే ఉపయోగం లేదన్నారు. జిల్లా కేంద్రంలో కనీసం రెండు పడక గదుల నిర్మాణాలకు అతీగతీ లేదన్నారు. కాకతీయ మిషన్ నత్తనడకన సాగుతుందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇప్పటి వరకు పంపిణీ చేసింది లేదన్నారు. ఉద్యోగ కల్పనలో సైతం ఎలాంటి ఫలితాలు లేవన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ప్రజా సమస్యలను ఎన్ని పరిష్కరించారో ఉన్నతాధికారులు సమాధాం చెప్పాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కారం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### సారూప్యతతో బాలికావిద్య

భారతీయ బాలికలు, బాలురకు సమానంగా విద్యాభివృద్ధి సాధించడం అబ్బురపరుస్తున్నది. ఎన్నో దశాబ్దాలుగా తీరని ఆకాంక్షగా ఉన్న బాలికా విద్య ఇప్పుడు వాస్తవం కాబోతున్నది. దేశంలోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో బాలికల శాతం 48కి చేరుకున్నదని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నివేదిక తెలియజేయటం సంతోషదాయకం. ఇది దేశాభివృద్ధిలో విప్లవాత్మక పరిణామం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే కాలానికి అక్షరాస్యతలో దేశం దయనీయస్థితిలో ఉండేది. ఇక మహిళా అక్షరాస్యత గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నాడు మహిళల్లో అక్షరాస్యత మూడు నాలుగు శాతం కన్నా ఎక్కువ లేదు. అలాంటి సామాజిక స్థితి నుంచి నేడు బాలికలు అక్షరాస్యతలో సమానస్థాయికి చేరుకున్నారు. డిగ్రీ, పీజీ చదువుల్లో బాలుర కన్నా బాలికల శాతమే ఎక్కువగా ఉంటున్నదని ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సాధించిన గొప్ప ఫలితమనేది అంగీకరించక తప్పదు. దేశం ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళికతో కార్యక్రమాలు రూపొందించి అమలుచేయటం ద్వారా అద్భుత ఫలితం సాధించగలిగాం. బాలికలకు అవకాశాలను అందుబాటులో ఉంచటంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) కూడా కొనియాడింది. అలాగే యువత స్థితి మెరుగుపరిచే విధానాల అమలులో భారత్ ఒక ఉదాహరణ అని ది స్టేట్ ఆఫ్ పాపులేషన్-2016 తన నివేదికలో శ్లాఘించటం మన నిబద్ధతకు నిదర్శనం. బాలికలు విద్యావంతులు కావడానికి అనేక అవరోధాలు ఉన్నాయి. అనేకానేక సామాజికార్థిక అంశాలతో పాటు, మూఢాచారాలు కూడా కారణం. ఆడపిల్లలు గడప దాటడమే తప్పని భావించే కాలాన్ని దాటి ఎంతో దూరం వచ్చాం. ఆడపిల్లలు చదువులతో ఊర్లు ఏలేదుందా, రాజ్యాలు పాలించేది ఉందా, ఓ ఇంటికి సాగనంపడమే కనుక, చదువుల కోసం ఖర్చు చేసుడెందుకు అనే దురభిప్రాయాలు ఉండేవి. ఒకే ఇంట్లో ఆడ, మగ శిశువుల మధ్య వ్యత్యాసం కొనసాగింది. ఇలాంటి సామాజిక పరిస్థితుల్లోంచి బాలికా విద్య విషయంలో ప్రభుత్వాలు పట్టువిడువకుండా చేసిన ప్రయత్నాలు, ప్రచార కార్యక్రమాలు పోషించిన పాత్ర అద్వితీయమైనది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1988నుంచి జాతీయ అక్షరాస్యతా కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇది కొనసాగుతుండగానే 2000 సంవత్సరంలో సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామస్థాయి నుంచి బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండేట్లు చర్యలు తీసుకున్నారు. గత ముప్పై ఐదేండ్ల కాలంలో 64కోట్ల మంది చదువటం, రాయటం నేర్చుకున్నారు. గతంతో పోలిస్తే అక్షరాస్యత రెట్టింపయ్యింది. యునెస్కో గణాంకాల ప్రకారమే 1981లో 29.3 కోట్లమంది అక్షరాస్యులుంటే, అది 2015 నాటికి 93.1 కోట్లకు చేరుకున్నది. మొత్తంగా అక్షరాస్యత పెంచటం కోసం కార్యక్రమాలు రూపొందిస్తూనే, బాలికా విద్యకోసం ప్రత్యేక కృషిచేశారు. ముఖ్యంగా 1990 దశకం నుంచి దేశంలో వచ్చిన విప్లవాత్మక పరిణామాలు కూడా మహిళా సాధికారతకు ఊతమిచ్చాయి. మహిళలు పురుషులతో సమానస్థాయిలో ఉద్యోగాల నిర్వహణలో రాణించి, ఆ పదవులకే వన్నె తెచ్చారు. ఒకానొక దశలో బడా కార్పొరేట్ కంపెనీలు సైతం మహిళా ఉద్యోగుల వైపే చూసే స్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యతపై, ముఖ్యంగా బాలికా సంక్షేమంపై ప్రత్యేక కృషి చేస్తున్నది. కేజీ టు పీజీ దాకా ఉచిత విద్యమొదలు, రాష్ట్రంలో ఆసరా పథకం తర్వాత అతిపెద్దది సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ పథకమే. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 31,711 ప్రధాన అంగన్ వాడీ కేంద్రాలు, 3,989 మినీ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా మాతా, శిశువులకు సమగ్ర పౌష్ఠికాహారం అందిస్తూ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభిస్తున్నది. అక్కడినుంచే శిశువుల ఆరోగ్య స్థితిగతులు, ఎదుగుదలను పొందుపర్చే పిల్లల అభివృద్ధి పుస్తకాలను రూపొందించి ప్రతి శిశువు ఆరోగ్యంగా రూపుదిద్దుకునేందుకు కృషి చేస్తున్నది. క్రీడారంగంలో ఉన్నత శ్రేణికి చేరిన సానియా, సైనా వంటి క్రీడాకారిణులను సత్కరించడం ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డలను చూసి తల్లిదండ్రులు గర్వపడాలనే సందేశాన్ని ప్రజలకు అందించారు. దీనివల్ల బాలికలంటే చిన్నచూపు పోయింది. ఆడపిల్ల పుడితే సంతోషించి, చదివిస్తున్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా బాలికల కోసం 500 గురుకులాలు ప్రారంభమయ్యాయి. దేశ చరిత్రలోనే ఇదొక అసాధారణ ఘట్టంగా చెప్పుకోవచ్చు. ఇవన్నీ బాలికా విద్యపట్ల ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా భావించాలి. బాలికల విద్య విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమైనది.

## తప్పులతడకగా జీఎస్‌టీ



లక్నో: జీఎస్‌టీ అమలుపై మోదీ సర్కార్ తొందరపాటుతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు.హడావిడిగా, తప్పులతడకగా జీఎస్‌టీ అమలుకు పూనుకోవడంతో వ్యాపారులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాలతో ప్రజలు విసిగిపోయారని, యూపీలో అభివృద్ధి నిలిచిపోయిందని అఖిలేష్ అన్నారు. యూపీ సర్కార్ వైఫల్యాలతో ఎస్‌పీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తుకుతెచ్చుకుంటున్నారని అన్నారు. 2019లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో తమ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మహాత్ముడి మరణం కాంగ్రెస్‌కే లాభం



న్యూఢిల్లీ : కేంద్రమంత్రి ఉమాభారతి మరోసారి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ హత్యతో కాంగ్రెస్ పార్టీ అన్నిరకాలుగా లబ్ధిపొందగా.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఇబ్బందులను, నష్టాలను అనుభవించిందని ఆమె వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లో పర్యటిస్తున్న ఉమాభారతి.. ఒక సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మహాత్ముడి మరణం వల్ల లబ్ధి పొందిన వ్యక్తులు, పార్టీ ఎవరో అందరికీ తెలుసునని చెప్పారు. ఇదే క్రమంలో సంఘ్ నేతలు జైలుకు వెళ్లారు.. సంఘ్‌పై నిషేధం విధించారు.. అప్పటి నుంచి ఇప్పటివరకూ సంఘ్ కార్యకర్తలు ఇబ్బందులు, సమస్యలనే ఎదుర్కొంటూనే ఉన్నారు అని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతల అభిప్రాయాలు ఆయనకు తెలుసుకు కాబట్టే.. స్వతంత్రం వచ్చాక.. కాంగ్రెస్‌ను రద్దు చేయాలని మహాత్మాగాంధీ సూచించారని ఆమె అన్నారు.

## మోదీజీ..అమిత్ షా అంటే భయమెందుకు?



పనాజీ : బీజేపీ చీఫ్ అమిత్ షా కుమారుడిపై వచ్చిన ఆరోపణల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ మౌనందాల్చడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. జే షాపై నిష్పాక్షిక విచారణ జరిగేందుకు అమిత్ షా తన పదవి ఉంచి వైదొలగాలని డిమాండ్ చేసింది. షెల్ కంపెనీలకు వ్యతిరేకంగా ప్రధాని తీవ్ర చర్యలు చేపడుతుంటే ఆ తరహాలోనే అమిత్ షా కుమారుడు జే షాకు చెందిన టెంపుల్ ఎంటర్‌ప్రైజ్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమాలకు పాల్పడిందని ఏఐసీసీ ప్రతినిధి ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పారదర్శకత గురించి మాట్లాడే ప్రధాని, అమిత్ షాలు ఈ ఆరోపణలపై విచారణ జరిపించేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు.

అమిత్ షాను ప్రధాని ఎందుకు కాపాడుతున్నారని.. తనకు సన్నిహితుడైన వ్యక్తిని జవాబుదారీగా ఉండాలని కోరేందుకు ఎందుకు జంకుతున్నారని నిలదీశారు. షెల్ కంపెనీలపై పోరాడుతున్నానని, డొల్ల కంపెనీలను మూసివేయిస్తానని చెబుతున్న ప్రధాని అమిత్ షా కుమారుడి డొల్ల కంపెనీలపై మౌనం దాల్చారని విమర్శించారు. జే షా డొల్ల కంపెనీలపై విచారణ చేపడితే వాటిలో డొల్లతనం నిగ్గుతేలుతుందని అన్నారు.ఈ వ్యవహారంలో విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని ఆరోపించారు.

అమిత్ షా కుమారుడికి చెందిన కంపెనీ టర్నోవర్ కేవలం ఒక్క ఏడాదిలోనే (2015-16) రూ 50,000 నుంచి 80.5 కోట్లకు పెరిగిందన్న ఓ వెబ్‌సైట్ కథనం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఓ ఎన్‌బీఎఫ్‌సీ నుంచి హామీ రహిత రుణం పొందడం వల్లే టర్నోవర్ భారీగా పెరిగిందని దివైర్ వెబ్‌సైట్ పేర్కొంది.

## కాషాయం రంగులో అన్నాడీఎంకే హోర్డింగ్‌లు

చెన్నై : తమిళనాట రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికారంలో ఉన్న అన్నాడీఎంకేలో చీలికలు ఏర్పడటం మళ్లీ విలీనమవడం, పార్టీనుంచి శశికళ, దినకరన్‌లను బహిష్కరించడం.. ఇలా అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాజాగా తమిళ రాజకీయాల్లో మరో ఆసక్తికర ఘటన జరిగింది. అధికార పార్టీ ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు కాషాయ రంగులో కన్పించాయి. దీంతో అన్నాడీఎంకే.. భాజపాతో పొత్తు పెట్టుకుంటోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రబలుతున్న డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం హోర్డింగ్‌లు ఏర్పాటుచేసింది.

అయితే సాధారణంగా అన్నాడీఎంకే ఏ కార్యక్రమం చేపట్టినా ఆకుపచ్చ రంగునే ఉపయోగిస్తుంది. కానీ ఈ హోర్డింగ్‌లకు కాషాయపు రంగు ఉండటంతో చర్చనీయాంశంగా మారింది. దీంతో అన్నాడీఎంకే భాజపాతో పొత్తుకు ఇది సంకేతమని ప్రతిపక్ష డీఎంకే ఆరోపిస్తోంది. మరోవైపు ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. దీంతో ఈ వూహాగానాలు మరింత బలపడుతున్నాయి. అన్నాడీఎంకే భాజపాకు లొంగిపోయిందని డీఎంకే నేత స్టాలిన్ విమర్శలు చేశారు.

అయితే ఈ ఆరోపణలను అధికార పార్టీ కొట్టిపారేసింది. భాజపాతో ఎలాంటి పొత్తు లేదని.. అంతేగాక హోర్డింగ్‌లలో వాడిన రంగు కాషాయం కాదని ఎరుపు రంగు అని పేర్కొంది. ప్రజల దృష్టిని తొందరగా ఆకర్షించేందుకే ఈ రంగును ఉపయోగించినట్లు తెలిపింది. మరోవైపు పన్నీర్ కూడా ఇదే మాట చెప్పారు. ప్రధానితో ఎలాంటి రాజకీయ చర్చలు జరపలేదని.. ఇది మర్యాదపూర్వక సమావేశం మాత్రమేనని తెలిపారు.

## కవి సమయం

### యువత

కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో
దురలవాట్లకు అవకండి మీరు బానిసలు
తల్లిదండ్రులు పెట్టుకున్నారు మీ మీద ఆశలు
అప్పులు చేసి మరి చదివిస్తున్నారు చదువులు
వాళ్ళకి చెడ్డపేరు తేవద్దు మీరసలు
కావాలి మీరు అవినీతిని అరికట్టే సింహాలు
కావొద్దు మీరు ఉగ్రవాద పోషకులు
కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో

... కవితా రచన
వైదా ఈశ్వరరావు

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : అష్టమి ఉ.7.51; నవమి తె.5.12; పునర్వసు ఉ.11.19; రా.వ.6.50ల 8.20

శుక్రవారం 13-10-2017

**మేషం:** రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపా రులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు.

**వృషభం** : రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

**మిథునం** :వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టలు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

**కర్కాటకం** : స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే అస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పి స్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు.

**సింహం** : బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.

**కన్య** :కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదాయం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి.

**తుల** : ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం** : స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేష జాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు.

**ధనుస్సు** : ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు.

**మకరం** : వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. ఫైనా న్సు, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త వహించండి. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి.

**కుంభం** : ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెల కొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బంది లంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కా రమవుతాయి.

**మీనం** : బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుం బీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారుతుంది. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది.

## అయ్యప్ప చింతనతో...

## సంకీర్తన



### అయ్యప్ప ఎవరు..!

హరిహర సుతుడుగా అయ్యప్ప అవతరించినట్టు చరిత్ర చెపు తుంది. అయితే ఒకప్పటి కాలానికి వెడితే, విష్ణువుని ఆరాధించే వారిని వైష్ణవులని, శివుణ్ణి ఆరాధించేవారిని శైవులని, బ్రహ్మని ఆరాధించే వారంతా బ్రాహ్మణులని వర్గీకరణ జరిగింది. అయితే శృష్టిస్థితిలయ కారకులుగా రూపుదిద్దుకున్న ఆ పరమేశ్వరుని రూపాన్ని , భగవంతుడు ఒక్కడే అనే నిజాన్ని విస్మరించి, ఈ త్రిమూర్తులలో ఎవరు ఎక్కువ అనే తత్వం ఈ మూడు వర్గా ల్లోనూ తలెత్తింది. విష్ణువే ఎక్కువ అని వైష్ణవులు, శివుడే ఎక్కువ అని శైవులు వాదించుకోవడం మొదలు పెట్టి, హత్యలు చేసు కునే స్థితికి చేరుకున్నారు. బ్రాహ్మ ణులు ఇద్దరి మధ్య మీమాంశలో పడి కొందరు వైష్ణవుల్లోను, అత్యధిక శాతం శైవుల్లోను కలిసి పోయారు. శైవుల మధ్య వైష్ణవుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన విబేధాల వల్ల రక్తపాతం జరుగుతూ వుండేది. హిందూ సమాజం అస్తవ్యస్థంగా మారింది. చివరికి విష్ణు భక్తులు పెట్టు కునే నామాలు కూడా శైవులు నాకి అవ మానించేవారు. ఆ కోపావేశంలో శైవుల్ని హత్యచేయడానికి విషం కలిపిన నిలువునామాలు పెట్టుకునేవారు. వీరి నామాలు నాకిన శైవులు విప్రపభావంతో మరణించేవారు. ఎవరికి వారు మా మతం గొప్పదంటే, మా మతం గొప్పది అంటూ ఆధిపత్యపోరు నిరంతరం సాగిస్తూవుండటంతో సమాజంలో అశాంతి ప్రబలి పోయింది. సాధారణ ప్రజానీకం కూడా ఎవరు ఏమిటో తెలియని వాతావరణంలో కుమ్ములాటలకి దిగడం పరిపాటిగా మారింది. చివరికి రాజవంశాల్లో కూడా ఇదమిద్ధంగా సరైన అవగాహన లోపించడంతో రారాజులు, మహారాజులు కూడా ఈ విషయంలో నిర్లిప్తధోరణి పాటించారు. సమైక్యతకి కొందరు ప్రయత్నించినా ఫలితం అంతగా కనిపించలేదు. ఇంతటి అస్థిర పరిస్థితిని అదుపుచేసి, సుస్థిర సమాజస్థాపనకోసం హరిహరులు ఒక్కరే అని చేప్పే నేపథ్యంలో హరిహర సుతుడుగా ఇద్దర్నీ ఏకంచేస్తూ ఉద్భవించినవాడే అయ్యప్ప.

### అయ్యప్ప చరిత్ర

ఏ పురాణేతిహాసాల్లోను మనకి తెలిసినంతవరకూ అయ్యప్ప ప్రస్తావన ఉండదు. అయితే భస్మాసురుని సంహ రించడంకోసం శ్రీహరి జగన్మోహినిగా అవతరించడం, భస్మాసురుడికి వరాన్ని అనుగ్రహించి తన నెత్తిమీదికి తెచ్చుకుని కష్టాల్లో పడిన పరమ శివుణ్ణి రక్షించడం, జగన్మోహినిగా ఉన్న శ్రీహరిని చూసి శివుడు మోహించి కొంతకాలం తనతో దాంపత్యం చేయడం, ఆ దాంపత్య కారణంగా ఒక బాలుడు పుడతాడు. అవతార పరిసమాప్తం అవుతున్న సమయంలో ఆ కుర్రవాణ్ణి శివకేశవులు ఒంటరిగా ఆ అడవిలో విడిచి పెడుతూ, ఇతర జంతుజాలంతో ఇతనికి ఎటువంటి ఆపదా కలుగకుండా రక్షగా మెడలో ఒక మణిని వేసి ఇద్దరు తమ లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడితో ఆ ఇతిహాసం పూర్తవుతుంది. అయితే ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు వేటకు రాగా ఆ అడవిలో హరిహరులకు పుట్టిన కుర్రవాడు ఒంటరిగా దొరకుతాడు. పిల్లలు లేని ఆ మహారాజు ఆ కుర్రవాణ్ణి దైవప్రసాదంగా భావించి తన రాణి చేతిలో ఉంచి, మణిసహితంగా దొరికిన కారణంచేత మణికంఠుడు అనే నామకరణం చేస్తారు. యుక్తవయసు వచ్చిన మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలన్న తలంపుతో అతనిని సంప్రదించగా, అందుకు మణికంఠుడు తాను ధర్మసంస్థాపనకోసమే పుట్టిన కారణంచేత, తన తరువాత ఆ రాజదంపతులకు కలిగిన సంతానానికే పట్టాభిషేకం చేయమని, తాను బ్రహ్మచారిగా అడవికి పోయి తన అవతార కార్యక్రమాన్ని నిర్వహిస్తాననీ చెప్పి, రాజ్యత్యాగం చేసి శబరిగిరిని చేరతాడు.అక్కడి నుంచి హరిహర సుతుడుగా, అయ్యప్పగా, ధర్మశాస్తగా పిలవబడుతూ, అవతార విశేషం పూర్తి అవ్వగానే అదే శబరిగిరి మీద వెలిసి ఇప్పుడు అందరి పూజలూ, సేవలూ అందుకుంటున్నాడు.

## అమ్మవారిని దర్శించుకున్న బండారు దత్తాత్రేయ



బాసర : కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు భాజపా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్వర్‌రావు, ఆలయాధికారులు, స్థానిక భాజపా శ్రేణులు స్వాగతం పలికారు.

అనంతరం ఆయన ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి ఆయనను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భైంసా వ్యవసాయ మార్కెట్‌లో ఇటీవల జరిగిన ఘటనలు దురదృష్టకరమని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మంత్రిగా విధులు నిర్వర్తించినప్పుడు నిర్మల్ జిల్లాలో బీడీ కార్మికులకు ఐదువేల ఇళ్లు మంజూరు చేశానని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక భాజపా నాయకులు అంతగిరి రాజన్న, కిషోర్‌దేశాయ్, మామ్మాయి గంగాధర్, శివాజీ పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మంజీరా నుంచి నల్లవాగులోకి నీటిని మళ్లిస్తాం

మనూరు : మంజీరా నది నుంచి నల్లవాగు ప్రాజెక్టులోకి నీటిని మళ్లించడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని ఎత్తిపోతల పథకం ఎస్‌ఈ లక్ష్మారెడ్డి తెలిపారు. మనూరు, నాగల్‌గిద్ద మండలంలోని బోరంచ ఎత్తిపోతల పథకం, కరస్‌గుత్తిలో నల్లవాగులోకి వేళ్లే కాల్వను పరిశీలించారు.

మంజీరా నది నుంచి నల్లావాగు లోకి నీరు మళ్లించి, ఇంకా ఎక్కువగా భూమిని సాగులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమ న్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని చెప్పారు. నెలరోజుల్లో షాపూర్, కారాముంగి ఎత్తిపోతల పథకాల నుంచి రైతులకు నీరందిస్తామన్నారు. వచ్చే డిసెంబర్‌లో పుల్‌కుర్తి, తోర్నాల్ పథకాలు వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. తాగునీటిని సరఫరా చేసే బోరంచ ఎత్తిపోతల పథకాని మంజీరా నుంచి ఎక్కువ మొత్తంలో నీరందిస్తామని ఆయన తెలిపారు. ఏఈ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## పతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రామన్నపేట : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ప్రముఖ కవి, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు ఏనుగు నర్సింహారెడ్డి కోరారు. రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులు మదూరి జ్యోతి, చంద్రకళలకు ఏనుగు చంద్రారెడ్డి, కమలమ్మ దంపతులు బంగారు పథకాలను అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. కళాశాల అధ్యాపకుడు ఏనుగు ప్రదీప్‌రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించటానికి ప్రతి సంవత్సరం బంగారు పథకాలను తమ తల్లిదండ్రుల పేరుతో అందజేయటం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పథకం అందజేయటానికి రూ.50వేలు విరాళంగా ఇస్తానని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టరు ఎ.భానుప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు ఏనుగు ప్రదీప్‌రెడ్డి, సీహెచ్. భిక్షమయ్య, వెంకటరామారావు, బి.రవీందర్, సాలయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



ములకలపల్లి : 2019లో రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సున్నం నాగమణి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎస్.టీ సెల్ జిల్లా అధ్యక్ష నియామకాలు, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎస్.టీ సెల్ అధ్యక్ష నియామకాలు జరిగాయి. జిల్లా ఎస్.టీ సెల్ అధ్యక్షునిగా కీసరి భద్రయ్యను ఎంపిక చేశారు. ములకలపల్లి మండలానికి కణితి సత్యనారాయణ, చంద్రుగొండ మండలానికి బాలూనాయక్‌ను, అన్నపురెడ్డిపల్లి మండలానికి బానోతు భీముడు, దమ్మపేట మండలానికి కుమురం ప్రసాద్, అశ్వారావుపేట మండలానికి సంగా ప్రసాద్ రావును ఎంపిక చేసినట్లు ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలకు న్యాయం జరగడంలేదని అన్నారు. రెండు పడక గదులు ఇళ్లు ఏ పేదవానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని అన్నారు. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అధిష్టించాలని అన్నారు. కార్యక్రమంలో తుమ్మా రాంబాబు, పేటేటి నరసింహారావు, సాబీర్ హుస్సేన్, సత్యప్రసాద్, దుర్గారావు, మల్లయ్య, జగదీశ్, ఖాదర్‌బాబా ఉన్నారు.

## భయాందోళనకు గురికావొద్దు

హవేలిఘణపూర్: పోచారం ప్రాజెక్టు ఎత్తు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని, ఈ విషయంలో భయాందోళనకు గురికావొద్దని మెదక్ జడ్పీటీసీ సభ్యురాలు లావణ్యారెడ్డి స్పష్టంచేశారు. ముంపు గ్రామలైన కొత్తపల్లి, బూర్గుపల్లి, రాజ్‌పేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రాజెక్టు ఎత్తు పెంచే ప్రతిపాదన, ఆలోచన ఏదీ ప్రభుత్వానికి లేదని, దీనిపై ఆందోళన చెందవద్దని చెప్పారు. కొంతమంది రాజకీయ నాయకులు పూట గడిపేందుకు పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టు ఎత్తు పెంచడం వల్ల లాభం కంటే ఎక్కువ నష్టం ఉందని, దీనిపై ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చాని చెప్పారు. తెరాస మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అంజాగౌా, కిష్టయ్య, నాగేశ్వరరావు, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మరియన్నకు విద్యారత్న పురస్కారం

మోత్కూరు : మోత్కూరుకు చెందిన సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ పసల మరియన్న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో స్థానిక నటరాజ్ అకాడమిలో నిర్వహించిన కల్చరల్ రికార్డ్ ఆఫ్ తెలంగాణ కార్యక్రమంలో విద్యారత్న పురస్కారాన్ని అందుకున్నారు. డల్లాస్ తెలంగాణ ప్రజాసమితి ఫౌండేషన్ కమిటీ ప్రతినిధి, ఆటా బోర్డు ఆఫ్ ట్రస్టీ రఘువీర్‌రెడ్డి బండారు, ప్రముఖ సినీ దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ ప్రొడ్యూసర్ సెక్టార్ కౌన్సెల్ ఛాంబర్ కార్యదర్శి సాయివెంకట్, నటరాజ్ అకాడమి డైరెక్టర్ గిరి నల్లా చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు మరియన్న నాడిక్కడ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మరియన్నను పలువురు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు అభినందించారు.

## ఇళ్ల ప్రగతిపై సీఎం సంతృప్తి ఆసక్తిగా నిర్మాణాల పరిశీలన



సిద్దిపేట: పట్టణ శివారులో బహుళ అంతస్థులుగా నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని చూసి ముఖ్యమంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. శభాష్.. హరీశ్ అంటూ మంత్రికి కితాబునిచ్చారు. నిర్మాణాల తీరును చూసి ముచ్చటపడ్డారు. సిద్దిపేట సమీపంలోని నర్సాపూర్ వద్ద నిర్మాణదశలో ఉన్న వెయ్యికిపైగా ఇళ్ల సముదాయాన్ని సీఎం పరిశీలించారు. సిద్దిపేటలో సభ ముగిసిన తరువాత అక్కడికి చేరుకుని ఆసక్తిగా గమనించారు. ఇంటి లోపలికి వెళ్లి గదులను తిలకించారు. పేదలు సౌకర్యవంతంగా నివసించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్న పాలానాధికారి వెంకటరామరెడ్డిని సీఎం అభినందించారు. ఆదర్శంగా పనులు జరుగుతున్న తీరు బాగుందని అన్నారు. భోజనం చేసిన తరువాత ముఖ్యమంత్రి సిరిసిల్లకు బస్సులోనే బయలుదేరి వెళ్లారు.

## డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేయాలి

### జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి

ఆదిలాబాద్ : జిల్లాలో కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేసి ఇంటింటికీ నీళ్లు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి ఆదేశించారు. పాలనాప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో వాటర్‌గ్రిడ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగుతున్న పనుల ప్రగతి, పైపులైన్ల నిర్మాణం పురోగతి వివరాలను ఆ శాఖ అధికారులు పాలనాధికారికి వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న పైపులైన్లు, ట్యాంకులను నాణ్యంగా ఉండేలా నిర్మించాలని సూచించారు. అక్టోబర్ చివరన నిర్వహించే సమావేశానికి ఆయా పనుల నిర్మాణ ఛాయచిత్రాలను తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈపీ కృష్ణారెడ్డి, డీఈలు సందీప్, మధుసూదన్, ఎల్‌ఎన్‌టీ ప్రాజెక్టు మేనేజర్ కార్తికేయ, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

### చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

భువనగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 9, 10, 11 తేదీల్లో దిల్లీలో కార్మిక సంఘాలు నిర్వహించే చలో దిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ హెచ్‌ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తీగల మధుగౌడ్ కోరారు.

## అందుబాటులో ఉండేలా కలెక్టరేట్ నిర్మించాలి



మెదక్: మెదక్ పట్టణంలో అందరికీ అందుబాటులో ఉండే స్థలంలో సమీకృత కలెక్టరేట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రాందాస్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ఎం.ఎల్.ఎన్.రెడ్డి, మహేందర్‌రెడ్డి, రఘు, బాల్‌రాజ్, మల్లేశం, గోవిందర్‌రాజ్, నరేష్ మాట్లాడుతూ.. జిల్లా ఆవిర్భావ దినోత్సవం రోజున సిద్దిపేటతో పాటు పలు జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా మెదక్‌లో చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోనే కలెక్టరేట్ నిర్మిస్తే జిల్లాలోని అన్ని ప్రాంతాల వారికి అనుకూలంగా ఉంటుంద న్నారు. అలాకాకుండా పట్టణానికి దూరంగా ఉన్న రాజ్‌పల్లి శివార్లలో నిర్మిస్తే ప్రజలకు దూరాభారమై ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నా రు. కలెక్టరేట్ భవన నిర్మాణ స్థలం ఎంపిక విషయంలో కలెక్టర్‌పై రాజకీయ ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి రాస్తారోకో విరమింపజేశారు.

## ఆడపిల్లలను ఉన్నత చదువుల దిశగా ప్రోత్సహించాలి

ఆదిలాబాద్ : ఆడపిల్లలను తప్పకుండా చదివించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్త్రీ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆడ పిల్లలు అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారని వివరించారు. ప్రభుత్వం సైతం వారి ప్రయోజనాల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దామంటూ అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సీఈఓ జితేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ మిల్కా, క్రీడాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈఓ రాథోడ్ శ్యాంరావు, బాలల సంరక్షణాధికారి రాజేంద్రప్రసాద్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కవులు సాహిత్య పరంపరను కొనసాగించాలి

### డీఆర్‌వో మహేందర్‌రెడ్డి

భువనగిరి : శతాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొనసాగుతున్న సాహిత్య పరంపరను ఈ తరం కవులు కూడా కొనసాగించాలని డీఆర్‌వో మహేందర్‌రెడ్డి అన్నారు. నూతన జిల్లా ఆవిర్భావోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కవులు తమ కవితల ద్వారా ప్రజా చైతన్యం కల్గించాలని కోరారు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా ఎప్పటికప్పుడు కవులు తమ రచనలను కొత్తదనంతో భావి తరాలకు అందించాలన్నారు.

ప్రముఖ సహజ కవి కూరెళ్ల విఠలాచారి మాట్లాడుతూ కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. తెలంగాణలో తమ రచనల ద్వారా కవులు, రచయితలు ఎన్నో ఉద్యమాలకు ఊతం అందించారని చెప్పారు. సుమారు 70 మంది కవులు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా కవి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య వ్యవహరించారు. మైనింగ్ ఏడీ వెంకటేశ్వర్లు, భువనభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు గడ్డం నర్సింహారెడ్డి, కవులు మెరుగు వెంకటదాస్, బండారు జయశ్రీ, కాచరాజు జయప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

### వీసీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



మహబూబ్‌నగర్ : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ జిల్లా అధికారులకు సూచించారు. ఆయన హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమంపై సమీక్షించారు. టీఎస్ ఐ-పాస్‌కు సంబంధించి జిల్లాస్థాయిలో ఉండే దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. రాయితీ రుణాలపై వివరాలు సేకరించారు. గ్రామాలవారీగా పరిశ్రమలు, వాటిలో ఉత్పత్తులు, తయారీకి సంబంధించిన వివరాలతోపాటు చిన్న పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నివేదికలు కోరారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా పరిశ్రమల్లో విస్తృతంగా మొక్కలు నాటించాలన్నారు. పర్యావరణం పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. సమీక్షలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సురేశ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీలు, కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాలనలో ప్రజలు భాగస్వాములు కావాలి

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

వనపర్తి : సంక్షేమ పథకాల ద్వారానే కాకుండా పాలనలో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సార్థకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణీకరణ మోజు నానాటికీ తగ్గిపోతోందని, హైదరాబాద్, అమెరికాల్లో ఉండేవారు సైతం గ్రామాల్లో నివశించడానికి ఇష్టపడుతున్నారన్నారు. ఇప్పుడిన్ని సమస్యలు ఉన్నాయంటే గత పాలకుల పాలనే కారణమన్నారు. ప్రభుత్వ ఖర్చులతోనే విద్య, వైద్యం అందించేలా ప్రమాణాలు పెంచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయిలో ఉన్న ఏ అధికారిపై ప్రభుత్వం దురుసుగా ప్రవర్తించలేదన్నారు. భవిష్యత్తులోనూ ఎవరినీ ఇబ్బంది పెట్టబోమన్నారు. సాగునీటి వనరులపై ప్రధాన దృష్టి సారించామన్నారు. ఎమ్మెల్యే చిన్నారెడ్డి వనపర్తిని చిన్న జిల్లా అనడం భావ్యం కాదన్నారు. సహేతుకంగానే జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. శాసనసభ్యుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి, ఉద్యోగ, ఐకాస ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు కూర్చొని జిల్లాను సాధించుకున్నామన్నారు. పాలన ఇంకా గాడిలో పడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 44 శాఖల్లో 862 పోస్టులకు 336 ఖాళీలున్నాయని, సంవత్సరంలోపు భర్తీ చేస్తానన్న ప్రభుత్వం మూడున్నరేళ్లగా ఖాళీగా ఉంచిందన్నారు. జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి మాట్లాడుతూ.. చిన్న జిల్లాల ఏర్పాటు త్వరితగత అభివృద్ధి కోసమేనన్నారు. జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బి.కృష్ణ, జిల్లా సంయుక్త కలెక్టరు నిరంజన్, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రయ్య, ఆర్డీవో చంద్రారెడ్డి, ఎంపీపీ శంకర్‌నాయక్, పెబ్బేరు, వనపర్తి మార్కెట్‌కమిటీ ఛైర్మన్లు బుచ్చారెడ్డి, రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. స్వర్ణముఖి ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

## మిషన్ భగీరథ పనులపై మంత్రి సమీక్ష



ఆదిలాబాద్ : ఆదిలాబాద్‌లో కొనసాగుతున్న మిషన్ భగీరథ పనుల పురోగతిపై మంత్రి జోగు రామన్న సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్తు అధ్యక్షురాలి ఛాంబర్‌లో వాటర్‌గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. మొదట వాటర్‌గ్రిడ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఆయా గ్రామాల వరకు కొనసాగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం తదితర వాటిని గురించి మండలాలు, గ్రామాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు అడిగారు. కొన్ని చోట్ల ఆలస్యమవుతుండటం పట్ల అధికారులను వివరణ అడిగారు. వివాదస్పందంగా ఉన్న గ్రామాల వద్ద కొందరు సర్పంచులు సహకరించడం లేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎక్కడెక్కడ ఇలాంటి సమస్యలు ఉన్నాయో తెలపాలని సర్పంచులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో గ్రామాలో సాగుతున్న ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణాల వివరాలను తెలుసుకున్నారు. కొన్ని చోట్ల ఆలస్యం కావడం పట్ల సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్‌లోగా ఆయా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మనోహర్, జడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్కినేని పేరుతో బాధ్యత పెరిగింది : సమంత



టాలీవుడ్ నటి సమంత ఇప్పుడు అక్కినేని సమంతగా మారిన విషయం తెలిసిందే. నాగార్జున ముఖ్య పాత్రలో సమంత నటించిన రాజుగారి గది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నాగార్జున అండ్ చిత్రయూనిట్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా అక్కినేని సమంతగా మీరు ఎలా ఫీలవుతున్నారని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ..అక్కినేని పేరుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పింది సమంత. అక్కినేని అభిమానుల అంచనాలకు అనుగుణంగా నడుచుకుంటానని చెప్పింది సమంత. తన భర్త, కుటుంబం ఎలాంటి ఆంక్షలు విధించకుండా సినిమాలు చేసేందుకు తనకు ఎంతో స్వేచ్ఛనిచ్చారని తెలిపింది సమంత. ఓంకార్ డైరెక్షన్ లో తెరకెక్కిన రాజుగారి గది 2 సినిమాలో సమంత లాయర్ గా కనిపించనుంది.


# ఫిబ్రవరిలో ముహూర్తం!



మహేష్‌బాబు 25వ చిత్రం త్వరలో పట్టాలెక్కనుంది. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో రాజకీయ నేపథ్యంలో తెరకెక్కుతున్న భరత్ అనే నేను చిత్రంలో నటిసున్నారు మహేష్. ఈ చిత్రం తరువాత ఆయన వంశీపైడిపల్లితో ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు, సి.అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రం ఫిబ్రవరి నుంచి సెట్స్‌పైకి రానున్నట్లు సమాచారం. తొలుత సంక్రాంతికి చిత్రీకరణ మొదలు పెట్టాలని చిత్ర వర్గాలు భావించాయి. అయితే భరత్ అనే నేను చిత్రీకరణ కారణంగా ఫిబ్రవరి నుంచి ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అమెరికాలో అత్యధిక భాగం చిత్రీకరణ జరుపుకోనున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహకుడిగా పి.ఎస్.వినోద్, సంగీత దర్శకుడిగా దేవీశ్రీప్రసాద్ పనిచేయనున్నారు.

# చిత్రభాను

## తేజ డైరెక్షన్‌లో వెంకీ !



నేనే రాజు నేనే మంత్రి తర్వాత మళ్లీ తేజ డైరెక్ట్ చేయనున్న సినిమాలో విక్టరీ వెంకటేష్ నటించనున్న సంగతి తెలిసిందే. ఫిలింనగర్ లేటెస్ట్ అప్‌డేట్స్ ప్రకారం ఈ సినిమాలో వెంకీ ఓ ప్రొఫెసర్ పాత్రలో నటించనున్నాడు. రెండు విభిన్నమైన షేడ్స్ కలిగిన ఈ పాత్రకు ప్రస్తుతం తేజ మరింత పదును పెడుతున్నాడు. తేజ చెప్పిన కథ నచ్చడంతో వెంకీ వెంటనే ఈ సినిమాకు సైన్ చేశాడట. నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి సంయుక్తంగా నిర్మించనున్నాయి. వెంకీ హీరోగా తెరకెక్కనున్న ఈ సినిమాలో కథ ప్రకారం మరో యంగ్ హీరోకి కూడా అవకాశం వుంది. కానీ ఆ యంగ్ హీరో ఎవరు, వెంకీ సరసన జత కట్టబోయే హీరోయిన్ ఎవరు అనే విషయాల్లో ప్రస్తుతానికి తేజ ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. ఇప్పటికే ఈ సినిమా కోసం కంపోజర్ అనూప్ రూబెన్స్ రెండు పాటలు కూడా రెడీ చేసి పెట్టాడు.

నేనే రాజు నేనే మంత్రి తర్వాత తేజ మరోసారి అనూప్‌తో కలిసి పనిచేస్తుండగా గోపాల గోపాల తర్వాత వెంకీతో అనూప్ కలిసి పనిచేస్తోన్న సినిమా కూడా ఇదే.

## రామ్ చరణ్‌కు మెగాస్టార్ అల్టిమేటం!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం సైరా నరసింహా రెడ్డి. స్వాతంత్ర్యం రాక ముందు నాటి ఇతివృత్తంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఉయ్యాలవాడ నరసిం హా రెడ్డిగా చిరంజీవిగా ఈ మూవీలో కనిపించనున్నారు. రామ్ చరణ్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తు న్నారు. 1940ల నాటి సినిమా కావడంతో ఇందులో భారీగా విజువల్ ఎఫెక్ట్స ఉపయోగించనున్నారు. సైరాతో భారీ విజయం అందుకోవాలని చిరంజీవి భావిస్తుండగా.. రామ్ చరణ్ ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడటం లేదు. బ్రిటిష్ పాలనను కళ్లకు కట్టేలా.. భారీ రేంజ్‌లో ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స ఉపయోగించనున్నారని తెలుస్తోంది. గ్రాఫిక్స్ క్వాలిటీ విషయంలో ఏ మాత్రం రాజీపడొద్దని మెగాస్టార్ తన కుమారుడికి అల్టిమేటం జారీ చేశారట. దీంతో చరణ్ లండన్లోని ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స సంస్థలను సంప్రదించారని తెలుస్తోంది. ఈ సినిమాను తెలుగుతోపాటు తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కు భారీ స్పందన లభించిన సంగతి తెలిసిందే.

# వృద్ధనటుడిని ప్రేమిస్తున్న నమిత..?



తన భారీ అందాలతో కోలీవుడ్ తంబిలను అలరించిన నమిత గుర్తుండే ఉంటుంది. ఇటీవలి కాలంలో సినిమాల్లో అవకాశాలు రాక రాజకీయాల్లో చేరతాను అంటూ కొంత కాలం పాటు హడావిడి చేసింది. నమిత చేరతానన్నా ఏ రాజకీయ పార్టీ అంత సాహసం చేయలేకపోయింది. ఇక సినిమాలు, రాజకీయాలు అచ్చిరావనుకున్నదేమో ప్రేమ వ్యవహారానికి తెర తీసింది. పలు భాషలలో నటించిన నటుడు శరత్‌బాబుతో నమిత ప్రేమ వ్యవహారం నడుపుతోందన్న వార్త కోలీవుడ్‌లో బాగా హల్‌చల్ చేస్తోంది. దీనికి తోడు ఇటీవల శరత్‌బాబు కూడా తన రెండు పెళ్ళిళ్ళూ పెటాకులైనాయనీ, ముచ్చటగా మూడోసారి ఓ హీరోయిన్‌తో అఫైర్ సాగిస్తున్నాననీ బహిరంగంగానే చెప్పాడు. దాంతో ఆ మూడో భార్య నమితేనని అందరూ ఫిక్స్ అవుతున్నారట!

# తమిళంలో నిర్మాతగా..



తెలుగు చిత్రసీమలో సృజనాత్మక కథాంశాలతో సినిమాల్ని తెరకెక్కించే దర్శకుల్లో సుకుమార్ ముందువరుసలో నిలుస్తారు. దర్శకుడిగానే కాకుండా కథాబలమున్న చిన్న చిత్రాలతో నిర్మాతగా తన ప్రతిభను చాటుకుంటున్నారాయన. తాజాగా ఆయన నిర్మాతగా తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నాగచైతన్య, తమన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 100 % లవ్ తెలుగులో పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నది. నవ్యమైన ప్రేమకథతో తెరకెక్కిన ఈ చిత్రం 100 % కాదల్ పేరుతో తమిళంలో రీమేక్ అవుతున్నది. చంద్రమౌళి దర్శకుడు. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్‌కుమార్ ఈ చిత్రంలో కథానాయకుడిగానటిస్తున్నారు. ఈ రీమేక్‌ను సుకుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భువన చంద్రమౌళితో కలిసి ఆయన ఈ రీమేక్‌ను నిర్మిస్తుండటం విశేషం.

## వీరాభిమాని కోసం కారు ఆపి ముచ్చటించిన హీరో

సినీ నటులంటే జనాలకు వల్లమాలిన అభిమానం. వారిని కలవాలని, మాట్లాడాలని పరితపించిపోతారు. తమ అభిమాన నటుడిని కలవడానికి చేయని ప్రయత్నం ఉండదు. అలాగే నటులు కూడా అభిమానులపై అప్పుడప్పుడు తమ ప్రేమను కురిపిస్తారు. అలాంటిది అభిమాన కథానాయకుడు తన కోసం కారు దిగి యోగక్షేమాలు అడిగితే ఆ అభిమాని ఆనందానికి అవధులుంటాయా. ఇక్కడ కూడా అదే జరిగింది. కేరళలోని వయనాడ్ ప్రాంతానికి చెందిన ఆదివాసి బాలన్‌కు నటుడు మమ్ముట్టి అంటే ప్రాణం. ప్రస్తుతం అంకుల్ చిత్రంలో నటిస్తోన్న మమ్ముట్టి షూటింగ్ కోసం వయనాడ్ ప్రాంతానికి వచ్చారు. ఆ విషయం తెలుసుకున్న బాలన్ ఎగిరి గంతులేశాడు. ఎలాగైనా తన అభిమాన నటుడిని కలవాలని ఆరాటపడ్డాడు. అందుకే మమ్ముట్టి వస్తున్న దారిలో కాపు కాసి ఆయన కారుకు ఎదురుగా వెళ్లి ఆపాడు. వెనుక సీటులో కూర్చున్న ఓ యువతి కారు అద్దం దించి ఏం కావాలని ప్రశ్నించింది.

ఆ ముందు సీట్లో కూర్చుంది స్వయంగా మమ్ముట్టి. అతన్ని చూడగానే బాలన్ సంతోషంతో పొంగిపోయాడు. మమ్ముట్టి అతడిని ఆప్యాయంగా పలకరించాడు. క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నాడు. ఒక సెల్ఫీ కూడా దిగాడు. బాలన్‌కి షేక్ హ్యాండ్ ఇస్తూ వీడియో కూడా తీయించుకున్నాడు. ఇదంతా పక్కనే ఉన్న డ్రైవర్ సింటో తొట్టిపుల్లి వీడియో తీశాడు. ఆ వీడియోను తొట్టిపుల్లి తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశాడు. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. వీడియో చూసిన వారంతా హీరోలందరికీ మమ్ముట్టి ఆదర్శమని ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కాజల్ ఫామ్‌లో ఉంటే తట్టుకోలేరంతే !



ఖైదీ నెంబర్ 150' సినిమాకి ముందు కాజల్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలిసిన విషయమే. జనతా గ్యారేజ్' చిత్రంలో స్పెషల్ సాంగ్, 'ఖైదీ నెంబర్ 150' అవకాశాలు మినహా కాజల్‌కి అసలు అవకాశాలే లేవు. ఈ రెండు చిత్రాలు మంచి విజయం సాధించడంతో కాజల్ ఒక్కసారిగా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారింది. ఆ తర్వాత ఆమె నటించిన రానా 'నేనే రాజు నేనే మంత్రి', అజిత్ 'వివేగమ్' వంటి చిత్రాలు విజయఢంకా మోగించడంతో, కాజల్‌కి వరుసగా ఆఫర్లు మొదలయ్యాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'మెర్సల్' విడుదలకు సిద్ధంగా ఉండగా, కళ్యాణ్‌రామ్‌తో 'ఎమ్.ఎల్.ఏ' చిత్రం చిత్రీకరణ జరుపుకుంటోంది.

అయితే ఇప్పుడు తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం తెలుగులో రీమేక్ కాబోతోన్న తమిళ 'బోగన్' చిత్రంలో కాజల్‌ని హీరోయిన్‌గా తీసుకున్నారంట. రవితేజ హీరోగా చేస్తాడని చెప్పుకుంటోన్న ఈ రీమేక్‌లో ఇప్పటి వరకు కేథరీన్ పేరు వినిపించింది. కానీ అనూహ్యంగా ఇప్పుడు ఈ అవకాశం కాజల్‌ని వరించిందని ఫిల్మ్‌నగర్లో టాక్ నడుస్తోంది. విశేషం ఏమిటంటే కాజల్ హిట్ అందుకొన్న 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రంలో కేథరినే సెకండ్ హీరోయిన్. కాజల్‌కి అవకాశాలు లేనప్పుడు చిన్నచూపు చూసిన వారు కూడా, ఒక్కసారి కాజల్ ఫామ్‌లోకి వచ్చిందంటే తట్టుకోలేరంతే అంటూ కాజల్‌కి వస్తోన్న అవకాశాలపై కామెంట్ చేస్తున్నారు.

# రోబో అమీ!



రజనీకాంత్ కథానాయకుడిగా దర్శకుడు శంకర్ సృష్టిస్తున్న మరో అద్భుతం 2.0. టూడీ, త్రీడీ ఫార్మాట్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో లైకాప్రొక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. అమీజాక్సన్ కథానాయకగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ విలన్‌గా కీలక పాత్రలో నటిస్తున్నారు. మర మనిషిలో ప్రేమపుడితే దాని పర్యవసానం ఎలా వుంటుందనే ఆసక్తికరమైన కథ, కథనాలతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రారంభం నుంచి సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటి వరకు రజనీకాంత్, అక్షయ్‌కుమార్‌ల లుక్‌లను మాత్రమే చిత్ర బృందం విడుదల చేసింది. అయితే తాజాగా ఇందులో కథానాయకగా నటిస్తున్న అమీజాక్సన్ ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు శంకర్ బుధవారం ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ప్రపంచం కేవలం మనుషుల కోసమే కాదు అని అనిరాసి వున్న ఈ ప్రచార చిత్రంలో అమీ రోబో గెటప్‌లో కనిపిస్తున్నది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ గీతాన్ని చెన్నైలోని రెడ్ హిల్స్‌లో ఏ.ఆర్.రెహమాన్ కొత్తగా నిర్మించిన వైఎమ్ స్టూడియోస్‌లో మంగళవారం నుంచి చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు శంకర్ ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ఈ నెల 27న దుబాయ్‌లో ఆడియోను విడుదల చేసి, టీజర్‌ను నవంబర్ 22న హైదరాబాద్‌లో, ట్రైలర్‌ను డిసెంబర్ 12న చెన్నైలో విడుదల చేయాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి.

# ధర్మానికి ఎప్పుడూ మంచికాలమే

- ప్రభుత్వ కబంధ హస్తాల్లో దేవాదాయ శాఖ
- దేవుని భూములా? వ్యాపార కేంద్రాలా?
- హిందూ జాతిపై దుర్మార్గుల దాడి నశించాలి
- కాలసర్పదోషం, చతుగ్రహ కూటమి అంటే దుర్మార్గత్వమే
- రాబోయే కాలాన్ని ప్రజలే నిర్ణయిస్తారు
- శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి




విశాఖపట్నం: భారత దేశం సర్వ ధర్మాలకూ నిలయమని, సృష్టి ఆవిర్భావం నుంచి ధర్మానిదే పైచేయిగా నిలుస్తూ వచ్చిందని అటువంటి ధర్మానికి ఎపుడూ మంచి కాలమే వస్తుందని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పేర్కొన్నారు. దేశానికి వెన్నెముకలైన రైతులు, సైనికులు క్షేమంగా ఉండాలని శారదాపీఠ ప్రాంగణంలో ఈ నెల 16వ తేదీ వరకు అతిరుద్ర, లక్షచండీయాగాన్ని ఉత్తర పీఠాధిపతి బాలస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ యాగాన్ని గత 11 సంవత్సరాలుగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి సౌజన్యంతో విశ్వశాంతికి మరియు లోక కల్యాణార్థమై వీటిని నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం ముందుగానే గోపూజతో ప్రారంభమై గణపతి పూజ, దీక్షాధారణ, రుత్విగ్వరణ, అగ్నిమథనంతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి నిష్ణాతులైన 300 మందికి పైగా వేదపండితులు పీఠప్రాంగణానికి విచ్చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామి అనుగ్రహభాషణం చేస్తూ ఈ నెల నుండి 2018 జనవరి వరకు దేశానికి కాలసర్ప దోషం, చతుగ్రహ కూటమి ఉండడం అంటే ఏమిటో అని అనుకున్నాం కానీ, ఆ కాలమంతా దుర్మార్గులకు అండగా ఉండే కాలమని అనుకోలేదని అన్నారు. ఈ కాలంలో దుర్మార్గత్వానిదే పైచేయిగా ఉంటుంది. రాక్షసత్వం పెచ్చురిల్లుతుందన్నారు. వీరి దుర్మార్గత్వపు ఆలోచనలతో బ్రాహ్మణులపైనా, కులాల పైనా, హిందూ మతంపైనా దాడులు నిర్వహించి విధ్వంసాలు సృష్టిస్తుంటారు. బ్రాహ్మణులకు అండగా శారదాపీఠం ఎప్పుడూ నిలుస్తుంటుంది. ఇదిమాత్రం సత్యం. ఇలాంటి మహాయజ్ఞాలు దేశ సౌభాగ్యానికి నిర్వహించడం జరుగుతూంటుందని మహాస్వామి పేర్కొన్నారు. ఎవరైతే బ్రాహ్మణుల మీద దాడి చేస్తున్నారో వారు వినాసకాలం తెచ్చుకోబోతున్నారు. ప్రభుత్వ కబంధ హస్తాల్లో ఉన్న టిటిడి, దేవాదాయ ధర్మాదాయ శాఖలు నిర్వహించాలి. కాని ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ ధూప దీప నైవేద్యాల కోసం ఇచ్చిన భూములు లీజుకు ఇస్తూ ప్రభుత్వాలు వ్యాపారం చేసుకుంటున్నాయని విమర్శించారు. ఆ భూములను వ్యాపార కేంద్రాలుగా మార్చేస్తున్నారు. ఈవిషయమై ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించినా నేతలకు కనువిప్పు కలగడం లేదన్నారు. ఇలాంటి విషయాలు ప్రజలకు తెలియాలి. ప్రభుత్వాలు ఎంత మోసం చేస్తున్నాయో కనువిప్పు కలగాలి.



ఒక టిటిడి, ఒక దేవాదాయ శాఖ అధికారులను చేతకానివారిని చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. నిష్కల్మషంగా ఉన్న వారిని, సేవా భావంతో ఉన్న వారిని పెట్టుకోకుండా రాజకీయ నిరుద్యోగులను నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దేవాలయ భూములను వీరి సొత్తుగా 33, 99 సంవత్సరాలు పాటు లీజుకు ఇస్తూ ఆ భూములను అనుభవిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఈ ఉద్యోగులంతా ఈ ప్రభుత్వంలో కేవలం 5 సంవత్సరాలు ఉద్యోగం చేసుకునే వారు మాత్రమే. ఇది ఎంత దుర్గార్మమో కదా. ఈ విషయాలపై మేము ప్రస్తుతం ఏమీ ఎక్కువగా మాట్లాడదలచుకోలేదు. సమయం కోసం ఎదురు చూస్తున్నాం. అంతేకాని ఏమీ మాట్లాడడం లేదంటే అదేదో చేతకాని తనమని అనుకుంటే పొరపాటే. రాజకీయ నాయకులకు మంచి సలహాలు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నామని అన్నారు. రాబోయే కాలాన్ని ప్రజలే నిర్ణయిస్తారని స్వామీజీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ లోకకల్యాణార్థం స్వామి వారు చేస్తున్న ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అనంతరం పలువురు భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. శారదాపీఠ ధర్మాధికారి కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో
# భారీ చోరీ!

### రూ.కోటి బంగారం, రూ.5లక్షలు నగదు అపహరణ

హైదరాబాద్ : గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో భారీ చోరీ జరిగింది. హైదరాబాద్ నగరానికి వస్తున్న ఓ మహిళ బ్యాగులోని భారీ మొత్తంలో నగదు, నగలు చోరీకి గురయ్యాయి. సికింద్రాబాద్‌లో రైలు దిగే సమయంలో గుర్తించిన బాధితురాలు స్థానిక రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన వాణి మియాపూర్‌లో నివాసం ఉంటున్నారు. బంధువుల శుభకార్యం ఉండటంతో రాజమహేంద్రవరానికి వెళ్లిన ఆమె తిరిగి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం ఉదయం సికింద్రాబాద్ చేరుకుంది. రైలు దిగే సమయంలో బ్యాగు చూసుకోగా అందులో ఉండాల్సిన రూ.5లక్షల నగదుతో పాటు రూ.కోటి విలువ గల బంగారు నగలు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. దీంతోబాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఏపీకి చెందిన ఓ మంత్రి బంధువని పోలీసులు తెలిపారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో.. ఏసీబీ సోదాలు

కరీంనగర్: హైదరాబాద్‌లో ఆబ్కారీ శాఖలో సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి అవినీతి నిరోధకశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాలో ఆయన బంధువుల ఇళ్లలో అనిశా అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న ఆయన సోదరుడు శ్రీధర్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేసి పలు పత్రాలు(దస్తావేజులు, ఐటీ రిటర్న్స్) స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఆయన స్వగ్రామం రామడుగు మండలం గోపాల్‌రావు పేటలో తండ్రి రాజిరెడ్డి, మామ నోముల భాస్కర్‌రెడ్డి ఇళ్లలో సోదాలు చేశారు. అనిశా డీఎస్పీ సుదర్శన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీనివాస్‌రెడ్డి తన మామ నోముల భాస్కర్‌రెడ్డికి రైసుమిల్లు ఉందని, ఆ ఆదాయం నుంచి తనకు ఆస్తులు కొనిచ్చారని హైదరాబాద్‌లో చెప్పారని.. ఈ మేరకు గోపాల్‌రావు పేటకు వెళ్లి సోదాలు చేయగా అది మినీ రైసుమిల్లని, రూ.90 వేలకు ఆరేళ్ల కిందటే అమ్మినట్లు తేలిందన్నారు. కరీంనగర్‌లో ఆయన సోదరుడు శ్రీధర్‌రెడ్డికి స్విఫ్ట్ డిజైర్ వాహనం ఉందని.. అదీ శ్రీనివాస్‌రెడ్డిదేనని తేలిందన్నారు. ఉద్యోగంలో భాగంగానే ఆస్తులు సంపాదించినట్లు తేలిందన్నారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను పరిశీలించి హైదరాబాద్ అనిశా అధికారులకు అందజేస్తామన్నారు.

## ముందస్తు చర్యలతోనే
# సుడిదోమ నివారణ



హైదరాబాద్: వరుస వర్షాలు వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఏరువాక సమన్వయకర్త, శాస్త్రవేత్త డా.అరుణశ్రీ తెలిపారు. కొన్ని రోజులుగా రోజువారీగా వర్షం పడుతుండటంతో వరి పంట కోత దశలో తెగుళ్లు ఉధృతమవుతున్నాయని వివరించారు. కరీంనగర్ రూరల్, చొప్పదండి, రామడుగు, తిమ్మాపూర్ తదితర మండలాల్లోని పొలాలను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. దోమను తట్టుకోని రకాలను సాగు చేయడం, పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉండటం, నత్రజని అధిక మోతాదులో వాడటం, కాలిబాటలు తీయకపోవడం వంటి కారణాలతో సుడిదోమ, అగ్గితెగులు ఆశించాయని పేర్కొన్నారు. అలాగే పైరు తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకు క్లోరోఫైరిఫాస్, ప్రొఫెనొఫాస్ లేదా లామ్డాసైహలోత్రిన్ పిచికారి చేయడంతో పురుగు ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అంకురం నుంచి ఈనిక దశల్లో దుబ్బుకు 20-25 దోమలు గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇథోఫ్లెన్‌ప్రాక్స్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే డె%నోటెఫ్యూరాన్ 0.4గ్రాములు లేదా బ్యూప్రొఫెజిన్ 1.6మిలీ లేదా పైమెట్రోజైన్ 0.60గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, పురుగు మందులు వాడేటపుడు పొలంలో నీటిని తగ్గించి, పాయలు తీసి మొక్కల మొదళ్లపై పడేట్లు పిచికారి చేస్తే మంచి ఫలితాలుంటాయని వివరించారు.

## అయ్యప్ప దీక్షాపరుల మహాపాదయాత్ర ప్రారంభం

కరీంనగర్ : జిల్లా కేంద్రం నుంచి ఏటా చేపడుతున్న అయ్యప్ప దీక్షాపరులు మహా పాదయాత్రను స్థానిక అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో 45 రోజుల పాటు కరీంనగర్ నుంచి వివిధ రాష్ట్రాల మీదుగా వెళ్లి కేరళ రాష్ట్ర శబరిమల సన్నిధానం చేరుకుంటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ అయ్యప్ప దీక్షలు ఏటా పెరగడంతో పాటు మహాపాదయాత్ర చేసే యాత్రికులు పెరగడం అభినందనీయమన్నారు.

# ఇక నుంచి ఐపీఎల్ కూడా ఆడను

- రిటైర్మెంట్.. నా సొంత నిర్ణయమే!
- టీమ్ఇండియా పేసర్ ఆశిష్ నెహ్రా



హైదరాబాద్: టీమ్ఇండియా పేసర్ ఆశిష్ నెహ్రా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికేందుకు నవంబరు 1న ముహూర్తం ఖరారైన సంగతి తెలిసిందే. తాజాగా నెహ్రా దీనిపై మాట్లాడుతూ.. రిటైర్మెంట్ నా సొంత నిర్ణయమే. ఎవరి ఒత్తిడి లేదు. వచ్చే ఏడాది నుంచి ఐపీఎల్ కూడా ఆడను అని తేల్చి చెప్పాడు. ఆసీస్‌తో టీ20 సిరీస్ కోసం బీసీసీఐ ఎంపిక చేసిన జట్టులో నెహ్రా స్థానం దక్కించుకున్నాడు. అయితే ఇప్పటి వరకు జరిగిన రెండు టీ20ల్లోనూ అతడు తుది జట్టులో చేరలేకపోయాడు. చివరి టీ20 కోసం కోహ్లి సేన హైదరాబాద్ వచ్చింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నిర్ణయాత్మక చివరి టీ20 జరగనుంది. ఈ సందర్భంగా నెహ్రా గురువారం మీడియాతో మాట్లాడాడు. రిటైర్మెంట్ నా సొంత నిర్ణయం. ఎవరి ఒత్తిడి లేదు. నవంబరు 1న న్యూజిలాండ్‌తో జరిగే టీ20 నా చివరి అంతర్జాతీయ మ్యాచ్. స్వస్థలం దిల్లీలో.. సొంత అభిమానుల మధ్య రిటైర్మెంట్ ప్రకటించడం కంటే ఇంకా ఏం కావాలి.


వస్తుసేవల పన్ను

దేశం పన్ను మార్కెట్

పన్ను చెల్లింపుదారులారా గమనించండి!

సెప్టెంబర్ నెల కొరకు జిఎస్‌టిఆర్-3బి ఫైలింగ్ చేసేందుకు గడువు తేదీ 20 అక్టోబరు, 2017.




దయచేసి మీ రాబడులను అతిత్వరగా ఫైలు చేయండి
( వీలయినంత వరకూ దీపావళికి ముందు )

దయచేసి గమనించండి

1. జిఎస్‌టిఆర్-3బి ఫైలింగుతో ఒక నెలకై చెల్లించాల్సిన పన్నును తరువాతి నెల యొక్క 20వ రోజు లోపు చెల్లించవలెను.
2. చివరి నిముషపు రద్దీ నివారించేందుకు మీ రాబడులను సమయంలోగా ఫైలు చేయండి. గడువు తేదీ వరకు నిరీక్షించకండి!
3. 2017, సెప్టెంబరు నెల కొరకు జిఎస్‌టిఆర్-3బి ఫైలింగు చేసేందుకు కాలం పొడిగించబడదు. దయచేసి దీనిని 20 అక్టోబరు, 2017లోగా ఫైలు చేయండి

గమనిక

ఎలక్ట్రానిక్ నగదు/క్రెడిట్ లెడ్జరునుంచి నగదు డెబిట్ అయినపుడు మాత్రమే పన్ను చెల్లింపు పూర్తగును. లెడ్జరు జమ సరిపోదు.

జిఎస్‌టి - ఒక మంచి & సులభతర పన్ను

ఎక్సైజు మరియు కస్టమ్స్ కేంద్ర మండలి & రాష్ట్రములు, కేంద్రపాలిత ప్రాంతముల కమర్షియల్ పన్నుల విభాగములు

www.cbec.gov.in, www.cbec-gst.gov.in

davp 15502/13/0240/1718


VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com